ప్రజాశక్తి
ఆదివారం 28 డిసెంబర్ 2025
12 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

# శ్రామిక ఉత్సవ్ ఆరంభం అదుర్స్

★ జోష్ నింపిన సినీ నటుడు ప్రకాష్ రాజ్

★ వినోదం, విజ్ఞానం, ఆహ్లాదంతో ఉప్పొంగిన విశాఖ తీరం

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

విశాఖ సాగర తీరంలో శనివారం సాయంత్రం ఆరంభమైన 'శ్రామిక ఉత్సవ్' ఆద్యంతం ప్రేక్షకుల నోట 'ఆదుర్స్' అనిపించింది. సిఐటియు ఆలిండియా 18వ మహాసభల సందర్భంగా నగరంలోని ఆర్‌కె.బీచ్ ఏయూ కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన శ్రామిక్ ఉత్సవ్‌ను సినీ నటుడు ప్రకాష్‌రాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రాజ్ ప్రసంగించిన తీరు దేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అనేక కోణాలను ఆవిష్కరించింది. సభికులను ఆలోచింపజేసి ఉత్తేజితుల్ని చేసింది. శ్రామిక్ ఉత్సవ్ ఆరంభమైన ఎగ్జిబిషన్ గ్రౌండ్ ప్రాంగణమంతా పుస్తక ప్రదర్శనలు, సైన్స్ ఎగ్జిబిషన్‌లు, వివిధ రకాల స్టాల్స్, సాహిత్య వేదికలతో అక్కడ 'పండగ' వాతావరణం అలముకుంది. చిన్నా, పెద్దలతో కలిసి ప్రజలంతా సాయంత్రం 4గంటల నుంచి అక్కడ సందడి చేశారు. విశాల విశాఖ జన సందోహంతో ఉప్పొంగింది.




మాట్లాడుతున్న సినీ నటుడు ప్రకాష్‌రాజ్



నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న చిన్నారులు



సాహిత్య వేదికను ప్రారంభిస్తున్న తెలకపల్లి రవి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ.గపూర్ అధ్యక్షతన 'సాంస్కృతిక ఉత్సవాల ప్రారంభోత్సవ సూచికగా సినీ నటులు ప్రకాష్ రాజ్ 'నగారా' మోగించారు. శ్రామిక వర్గ సంస్కృతిని పెంపొందించేందుకు ఈ 'శ్రామిక్ ఉత్సవ్' యుద్ధభేరి మోగించినట్టేనని కొనియాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రంగం సిద్ధం చేశాయని, కొనుక్కునేవాడికి అన్నీ అమర్చేదానికోసమే ప్యాకేజీని కేంద్రం ఇచ్చి అప్పుకు జమ చేసిందని గపూర్ తెలిపారు.

సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ 'దేశంలో మనువాదాన్ని అమలు చేసేందుకు 'ప్రభు'వే (మోడీని ఉద్దేశించి)

మిగతా 2లో..

## 30 నుండి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

▶ వార్త 2లో..

## ఎంవిఎస్‌ఎంఇ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

▶ వార్త 10లో..

## 30న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

▶ వార్త 2లో..




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

### సిపిఎం నేత అప్పలరాజు అరెస్టుపై..

## 29న బంద్‌ను జయప్రదం చేయాలి

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

వార్త 12లో..



## విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీకి డిజిపి హోదా

### - ఉద్యోగోన్నతి కల్పించిన ప్రభుత్వం

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో 1996 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి, ప్రస్తుత విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా విధుల్లో ఉన్న డాక్టర్ శంఖబ్రత బాగ్చీకి ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. ఆయనను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) కేడర్‌కు ప్రమోట్ చేస్తూ గవర్నర్ పేరు మీదుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ ఉద్యోగోన్నతి 2026 జనవరి 1 నుండి అమల్లోకి రానుంది. ఉద్యోగోన్నతి పొందినప్పటికీ, ఆయనను ప్రస్తుతం ఉన్న స్థానంలోనే కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. అంటే, ఆయన డీజీపీ హోదాలో విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా తన బాధ్యతలను కొనసాగిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

## ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం

### రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఓ 30 ప్రకారం ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, జనవరి నాటికి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గాజువాక ప్రాంతానికి చెందిన జివో నెంబర్ 45, యుఎల్సీ పరిధిలోని జివో 27, కన్వేయన్స్ డీడ్‌లకు సంబంధించిన జివో 296, సాధారణ ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించిన జివోల ఆవశ్యకత, అమలుపై క్షేత్రస్థాయిలోని అధికారులకు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తహశీల్దార్లకు సూచించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శనివారం జరిగిన విశాఖపట్టణం, భీమిలి రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. భూ క్రమబద్ధీకరణ, రీసర్వే,

మిగతా 2లో..

**మొదటి పేజీ తరువాయి..**

### 'శ్రామిక ఉత్సవ్' ఆరంభం అదుర్స్

రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రచారం చేయడం చూస్తే ఒకప్పుడు పాలకులు తమ మాటలు వినే దొంగలను, ముఠాలను పెంచి పోషించేవారని, నేడు కార్పొరేట్లను పాలకులు పోషిస్తున్నారని, అయితే ఇప్పుడు వారి మాట పాలకులే వినాల్సి వస్తుందని, అందుకు తాజా ఉదాహరణ 'ఇండిగో' విమానాల వైఫల్యం దేశాన్ని కుదిపేసిన సంగతి అందరూ చూశారు కదా?' అని అనడంతో ఒక్కసారిగా సభలో చప్పట్లు మార్మోగాయి.

తానెప్పుడూ మౌనంగా ఉండనని బావితరాలు తప్పు చేసేవాడినైనా క్షమిస్తాయి గానీ ప్రమాదకర పరిణామాలు జరుగుతుంటే మౌనంగా ఉండేవాడిని మాత్రం తరాలు క్షమించవన్నారు. నేను సినీ నటుడినైనా సాంస్కృతికంగా పోరాటం సాగిస్తానన్నారు. పోరాడుతున్న వారికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

### ఆక్రమణల క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతం

హౌసింగ్, యూఎల్సీ కేసులపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ జనవరి నెలాఖరునాటికి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మెట్రో రైల్ భూసేకరణ, మాస్టర్‌ప్లాన్ రోడ్లు, భూసర్వేలు, ల్యాండ్ పూలింగ్, వీఎంఆర్డీఏ లేఅవుట్ల ప్రగతి అంశాలపై ఆరా తీసిన ఆయన మెట్రో రైల్ ప్రాజెక్టు భూసేకరణలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, మెట్రో మార్గాల వెంట అక్రమ దుకాణాలు, వెండింగ్ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వరాదని స్పష్టం చేశారు. మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధిలో విద్యుత్ లైన్లు, అండర్ గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ల ఏర్పాటులో సమన్వయం పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, మ్యుటేషన్ వంటి ప్రక్రియల్లో తప్పకుండా సమయపాలన పాటించాలని, నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని ఆదేశించారు. సమావేశంలో విశాఖ, భీమిలి ఆర్డీవోలు సుధాసాగర్, సంగీత్ మాధుర్, సర్వే శాఖ డిడి, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# 30 నుండి జాతీయ గిరిజన యువ సమ్మేళనం

**నాలుగు రాష్ట్రాల నుండి ఆదివాసీలు రాక**

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :** 17వ జాతీయ గిరిజన యువ సమ్మేళనం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఈ నెల 30 నుంచి జనవరి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు. యూత్ హాస్టల్లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరుగు సమ్మేళనంలో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి 200 మంది గిరిజన యువతీ యువకులు పాల్గొంటారని పేర్కొన్నారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఇక్కడ వారికి చాటి చెప్పడమే ఈ సమ్మేళనం లక్ష్యమని తెలిపారు. దీనికి హాజరయ్యే ఆదివాసీ యువతీ యువకులు ప్రభుత్వ పారిశ్రామిక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తారని చెప్పారు. గిరిజన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల గురించి కూడా తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల గిరిజన యువతీ యువకులు ఆయా ప్రాంతాల కళారూపాలను ఇందులో ప్రదర్శిస్తారని తెలిపారు. పాత్రికేయుల సమావేశంలో నేరయొభారత్ రిసోర్స్ పర్సన్ ఎన్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ నేషనల్ అవార్డు గ్రహీత ఆర్.లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

### 13 మంది పోలీసులకు ఉద్యోగోన్నతులు

**ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ :** విశాఖ నగర పోలీసు కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న 13 మంది సిబ్బందికి ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించింది. ఈ మేరకు శనివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి వారికి ఉద్యోగోన్నతి ర్యాంకులు తగిలించి పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు. ఉద్యోగోన్నతి పొందిన వారిలో ఒకరు మహిళా ఎస్ఐగా, ఒకరు హెడ్ కానిస్టేబుల్‌గా, ఐదుగురు కానిస్టేబుళ్లుగానూ, ఆరుగురు ఎఆర్ కానిస్టేబుళ్లుగానూ ఉన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందిన వారు రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### మెడికల్ కళాశాలకు లక్ష్మి మృతదేహం అప్పగింత

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** కొత్తవలసకు చెందిన శరీర అవయవదాతల సంఘం సభ్యులు నున్నా రవికుమార్ తల్లి నున్నా లక్ష్మి శనివారం ఉదయం మరణించారు. వెంటనే ఎల్‌వి ప్రసాద్ నేత్ర బ్యాంకుకు కార్నియా దానం చేశారు. ఆమె మృతదేహాన్ని విశాఖ జిల్లా శరీర అవయవదాతల సంఘం ఉపాధ్యక్షులు జె.రాంప్రభు ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కాలేజీ అనాటమీ విభాగ అధిపతి డాక్టర్ రవీంద్ర కిషోర్‌కు అందజేశారు. నేత్ర, శరీర ధాత నున్నా లక్ష్మికి స్వెక్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి జోహార్లు అర్పించారు.

### ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఆర్టిసి విశాఖపట్నం జిల్లా డ్రైవర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో ట్రాఫిక్ రోజురోజుకు పెరుగుతుందని, దాన్ని తగ్గట్టు డ్రైవర్లు మెలకువలతో శిక్షణ పొందాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, ప్రతి బస్టాప్‌లో బస్సు ఆపి ప్రయాణికులను దింపి, ఎక్కించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మద్దిలపాలెం డిపో మేనేజర్ ఉమామహేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రశాంతి, రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ ఎంఎస్.రావు, డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ డిఎస్ ప్రసాద్, సూపర్వైర్లు పాల్గొన్నారు.





# 94 మంది పోలీసులకు రివార్డులు

**ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ :** విశాఖ నగర పోలీసు శాఖలో విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రివార్డులను అందజేశారు. శనివారం నిర్వహించిన 'యాన్యువల్ క్రైమ్ రివ్యూ మీటింగ్' సందర్భంగా హోంగార్డు స్థాయి నుండి సిఐ స్థాయి వరకు మొత్తం 94 మందికి ఆయన ప్రశంసా పత్రాలు, రివార్డు మంజూరు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, సిబ్బంది సంక్షేమంతో పాటు వారి సేవలను గుర్తించడం వల్ల పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ నగరం మరింత సురక్షితంగా ఉండాలనే లక్ష్యంతో, సమర్ధవంతంగా విధులు నిర్వహించే వారికి ప్రతి నెలా ఇలాంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రివార్డులు పొందిన వారిలో నగరం గుండా జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని, నిందితులను పట్టుకున్న వారు, చోరీకి గురైన సొత్తును, ఇతర విలువైన వస్తువులను వేగంగా స్వాధీనం చేసుకున్న సిబ్బంది, టెక్నాలజీని ఉపయోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన వారు, సంక్లిష్టమైన సైబర్ కేసులను ఛేదించిన సిబ్బంది ఉన్నారని తెలిపారు.

# నేడు రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** వంగవీటి మోహనరంగా మెమోరియల్ రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు వీఎంఆర్ మెమోరియల్ గ్రేటర్ విశాఖపట్నం ఆధ్వర్యాన, రేంబో పవర్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం తన కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరగనున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు ఆర్గనైజర్ చీఫ్ కనకరాజు తెలిపారు. కిక్ బాక్సింగ్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9290175667 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంటి, మచ్చరాజు, త్రినాధ్, చంటి, కొళ్లి సింహాచలం, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

### 30న జెడ్పి సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ :** జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని జెడ్పి ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పిటిసి సభ్యులు, ఎంపిపిలు అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

# విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలు


నియామకపత్రాలు అందిస్తున్న మంత్రి రవికుమార్ తదితరులు

ప్రజాశక్తి-మధురవాడ : విశాఖపట్నం సాగర్‌నగర్‌లోని ఏపిఈపిడిసిఎల్ సిఒఇటి భవనంలో విద్యుత్ శాఖలోని అర్హులైన 34 మందికి కారుణ్య నియామక పత్రాలను ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు గత 18 నెలల కాలంలో 287 మంది అర్హులైన అభ్యర్థులకు కారుణ్య నియామకాలు కల్పించడం ద్వారా ఆయా కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. సౌర శక్తిని ప్రోత్సహిస్తూ గతంలో విద్యుత్ లేని గ్రామాలు, గిరిజన ఆవాసాలకు వెలుగులు నింపుతున్నామని మంత్రి తెలిపారు. వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ శాఖలో మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఏపిఈపిడిసిఎల్ అధికారులు అభివృద్ధి చేసిన కొత్త యాప్ గురించి సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, సంస్థ డైరెక్టర్లు టివి.సూర్యప్రకాష్, ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశక్తి విలేకరి ఎంవి.రమణకు మాతృవియోగం


వెంకయ్యమ్మ (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖపట్నం : ప్రజాశక్తి ఆరిలోవ విలేకరి ఎంవి.రమణ తల్లి మీసాల వెంకయ్యమ్మ (88) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం పినతాడివాడ గ్రామానికి చెందిన మీసాల స్వామినాయుడు, వెంకయ్యమ్మ దంపతులకు పిల్లలు ఈశ్వరమ్మ, సత్యనారాయణ, సూర్యకాంతం, వెంకటరమణ ఉన్నారు. సుమారు 40 సంవత్సరాల క్రితం వెంకయ్యమ్మ భర్త స్వామినాయుడు మృతి చెందడంతో, వెంకయ్యమ్మ వ్యవసాయం చేస్తూ కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని పిల్లలను పెంచారు. వారికి మంచి విద్యాబుద్ధులు నేర్పించి జీవితంలో నిలదొక్కుకునేలా చేశారు. కుమారుడు సత్యనారాయణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కుమారుడు వెంకటరమణ ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకయ్యమ్మ, కుమారుల వద్దనే నివసిస్తూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎడిటివి ఇన్‌ఛార్జి రాజేష్‌రెడ్డి, భీమిలి డివిజన్ డిఐ వెంకటరమణ తదితరులు అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిపిఎం నాయకులు నరేంద్ర, శంకరరావుతో పాటు రాజకీయాలకతీతంగా తెలుగుదేశం, వైసిపి, జనసేన నాయకులు వెంకయ్యమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# పశువుల షెడ్లు ప్రారంభం


పశువుల షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం ఎల్‌వి.పాలెంలో పశువుల షెడ్లను శనివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. పాడి పరిశ్రమ ద్వారా గ్రామీణ రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పశువుల షెడ్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు ఒక్కో పశువుల షెడ్‌కు గరిష్టంగా రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. భీమిలి నియోజకవర్గ పరిధిలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి రూరల్ మండలాల్లో మొత్తం 112 పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.2.23 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. పశుగ్రాసం సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులపై నూరు శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జానకి, కూటమి నాయకులు చిక్కాల విజయ్‌బాబు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, తాట్రాజు అప్పారావు, బిఆర్‌బి.నాయుడు, లొడగల వెంకట్రావు, తమ్మిన అప్పలరాజు, లొడగల రమణ, అప్పారావు పాల్గొన్నారు.

# లాభసాటి వ్యవసాయ విధానాలపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : రైతాంగానికి లాభసాటి వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామి నాయుడు వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులకు సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం కమిటీ కార్యవర్గ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ ఆధారిత పరికరాలను సబ్సిడీ ధరలకు అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్గానిక్ ఫార్మింగ్ అధికారి మోహనరావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిన్నింటి జగన్నాథం, కార్యదర్శి శ్రీలక్ష్మీ చైతన్య, పలువురు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దివీస్ సహకారంతో నూతన విద్యుత్ లైన్

ప్రజాశక్తి- తగరపువలస : భీమునిపట్నం మండలం టి.నగరపాలెం గ్రామ పంచాయతీలో దివీస్ లేబొరేటరీ సంస్థ ఆర్థిక సహకారంతో నూతన విద్యుత్ లైన్‌ను ఏర్పాటుచేశారు. టి.నగరపాలెం రైతు భరోసా కేంద్రం నుండి గొల్లలపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వరకు విద్యుత్ దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై పంచాయతీ అభ్యర్థన మేరకు దివీస్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో 19 స్తంభాలు, 1100 మీటర్ల ఎలక్ట్రిక్ పవర్ కేబుల్, 55 ఎల్ఇడి విద్యుత్ దీపాలు అందించింది. ఈ విలువ సుమారు రూ.4.30 లక్షలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎఇ హరికుమార్, నాయకులు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, పొట్నూరు రాము, పొట్నూరు చిట్టిబాబు, పల్లా అప్పారావు, నానాజీ, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని పరిష్కరించాలి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి జోన్- 2 పరిధి మధురవాడ నగరంపాలెం రోడ్డులోని పోర్టు కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు మూడు నెలలుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సిఐటియు మధురవాడ జోన్ నాయకులు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల స్థానికులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు పూర్తి చేసి, కుళాయిల ద్వారా శాశ్వతంగా నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. తక్షణమే స్పందించి పనులు ప్రారంభించకపోతే, స్థానిక ప్రజలతో కలిసి జివిఎంసి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## యాక్షన్ ప్లాన్ అమలుపై పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : టెన్త్ విద్యార్థుల వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై జివిఎంసి 3వ వార్డు పరిధి గొల్లలపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం యాక్షన్ ప్లాన్ ప్రత్యేక అధికారి డాక్టర్ మీనాక్షి పరిశీలించారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా, సమయాన్ని వృథా చేయకుండా చదవాలని టెన్త్ విద్యార్థినులకు సూచించారు. టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనం మెనూ అమలును పరిశీలించారు. పలు రికార్డులు, టెన్త్ విద్యార్థులకు సంబంధించిన పలు నోట్ పుస్తకాలను పరిశీలించారు. ప్రిన్సిపల్ గంగాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకుంటున్నారని వైసిపిపై ఫిర్యాదు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం గ్రామపంచాయతీ అభివృద్ధిని వైసిపి మెంబర్లు అడ్డుకుంటున్నారని గ్రామ సర్పంచ్ ఎం.లక్ష్మీ భవానీ స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేశారు. ఈనెల 20న పంచాయతీ కార్యాలయంలో వార్డు మెంబర్లతో గ్రామసభ ఏర్పాటు చేశామని, సభ్యులు హాజరైనప్పటికీ తలపెట్టిన పనులు నిర్వహణకు మినిట్ పుస్తకాలపై సంతకాలు చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుందని లక్ష్మీభవాని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17.58 లక్షలు, జిపిఎస్ నిధులు రూ.17.36 లక్షలు పంచాయతీ ఖాతాలో ఉన్నా పనులు జరగడంలేదని వాపోయారు. పంచాయతీ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు.


ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి

## అనిట్స్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు సిద్ధం

ప్రజాశక్తి- తగరపువలస : అనిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలకు సిద్ధం అవుతోందని ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి చెప్పారు. శనివారం కాలేజీలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 2026 సెప్టెంబర్‌లో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. తమ కాలేజీలో చదివిన ఎంతో మంది విద్యార్థులు విదేశాలలో స్థిరపడ్డారని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నట్లు వివరించారు.

## నేరాలు ఘోరాలు

### ట్యాంకర్ లారీలో మంటలు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బోయపాలెం జాతీయ రహదారి సిగ్నల్ వద్ద శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో భారీ ప్రమాదం తప్పింది. మధురవాడ నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న ఓ ట్యాంకర్ లారీ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

### అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కిలో మీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. కోయంబత్తూరు నుంచి చెన్నై పేపర్ల వ్యర్థాలతో వెళ్తున్న లారీ క్యాబిన్ నుంచి మంటలు చెలరేగి మొత్తం తగలపడింది. డ్రైవర్ అప్రమత్తం ఆవడముతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు

### లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -గాజువాక : హిందూజా పవర్ ప్లాంట్ బొగ్గు లారీ ఢీకొని దేవాడ గ్రామానికి చెందిన నాగూర్ మీరా (33) తీవ్ర గాయాలపాలయ్యారు. శనివారం ఉదయం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. దేవాడకు చెందిన నాగూర్ మీరా శనివారం రోడ్డు దాటుతుండగా బొగ్గు లారీ ఢీకొట్టింది. నాగూరు మీరా కాలుపైనుంచి ముందు చక్రం వెళ్లిపోవడంతో కాలు మొత్తం నుజ్జయింది. చికిత్స నిమిత్తం అతన్ని కెజిహెచ్‌కు తరలించారు.

## 5వ వార్డులో జోనల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 5వ వార్డు పరిధిలోని పలు కాలనీల్లో శనివారం వేకువజామున జోన్-2 కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత విజ్ఞప్తి మేరకు స్వతంత్రనగర్, ఎన్‌టిఆర్ హుదూద్ కాలనీ, ఓజోన్ వ్యాలీ కాలనీ, శారదానగర్ ప్రాంతాల్లో పర్యటించారు. జోనల్ కమిషనర్‌కు, కార్పొరేటర్‌కు స్థానిక ప్రజలు పలు సమస్యలు తెలియపరిచారు. వార్డులో ప్రధానంగా తాగునీటి ఇబ్బందులు ఉన్నాయని, ముఖ్యంగా ఎన్‌టిఆర్ హుదూద్ కాలనీలకు జివిఎంసి తాగునీరు అందించాలని, శారదానగర్ కాలనీ కొండవాలు ప్రాంతాలలో తాగునీటి స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని, వెలగని వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల తదితర మౌలిక వసతులు కల్పించాలని జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ హేమలత కోరారు. ఈ సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలించిన జోనల్ కమిషనర్ తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు, జోగేశ్వరరావు పాత్రో, కొత్తల శ్రీను, సకల ప్రసాద్, జనసేన అధ్యక్షులు దేవర శివ, ముచ్చి రామనాయుడు, ఆనందరావు, రమణమ్మ, లక్ష్మి, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.



ఎంపికైన వారికి అర్హతా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపల్ మురళీకృష్ణ

## జాబ్ మేళాలో 108 మంది ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జరిగిన మెగా జాబ్ మేళాకు 287 మంది యువతీ యువకులు హాజరవ్వగా, 108 మంది ఎంపికైనట్లు స్కిల్ డెవలప్ మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రమేష్ నాయుడు తెలిపారు. పదోతరగతి నుంచి ఇంజినీరింగ్, పీజీ పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. ఎక్స్ టి గ్లోబల్, ఎస్ఎస్ఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ , దాగూర్ లేబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పేరెన్నిక గన్న కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన వారిని అభినందిస్తూ ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ అర్హతా పత్రాలు అందజేశారు.

# ఘనంగా స్టీల్‌ప్లాంట్ ఆసుపత్రి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ జనరల్ హాస్పిటల్ (విఎస్‌జిహెచ్) 34వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆసుపత్రి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్టీల్‌ప్లాంట్ కమర్షియల్ డైరెక్టర్ జివిఎన్.ప్రసాద్, గౌరవ అతిథిగా కేర్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సి.వి.రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ జిఎం డాక్టర్ జెఎన్.సారంగి ప్రారంభించి మాట్లాడారు. ఆసుపత్రిలో ఇటీవల చేపట్టిన వైద్య సేవల బలోపేత చర్యలు, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. రోగుల సేవలో అంకితభావంతో పనిచేస్తున్న వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, వైద్య పరిపాలన విభాగం, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్య అతిథి జివిఎన్.ప్రసాద్ మాట్లాడుతూ, విఎస్‌జిహెచ్ అందిస్తున్న సమగ్ర వైద్య సేవలను ప్రశంసించారు. డాక్టర్ కుప్పావి కష్ణమూర్తికి ఉత్తమ వైద్యుడిగా గోల్డ్ మెడల్‌ను విఎస్‌జిహెచ్ డిజిఎం డాక్టర్ రవిశంకర్ అందజేశారు. ఉత్తమ నర్సుగా సేవలందించిన స్మిత వై.లక్ష్మీప్రభాకర్‌కు బంగారు పతకాన్ని అసిస్టెంట్ మేనేజర్ (నర్సింగ్) పి.రాజేశ్వరి ప్రదానం చేశారు. 'ఎఎస్‌సివిడి (అథెరోస్క్లెరోటిక్ కార్డియోవాస్క్యులర్ డిసీజ్) నుంచి ముందస్తు అంచనా, నివారణ, రక్షణ" అనే అంశంపై డా. సి.వి.రావు అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది, వైద్య పరిపాలన అధికారులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వ్యవస్థాపక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

## ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో క్రీడా, సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ద్విరాష్ట్ర ఎమ్ఎస్ఎఫ్ఎస్ 11వ క్రీడా, సాంస్కృతిక పోటీలు సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. విశాఖపట్నం ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ఉడుముల బాల ఈ పోటీలను ప్రారంభించారు. 100 అడుగుల ఎత్తు గల జాతీయ పతాకాన్ని ఎస్ఎఫ్ఎస్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రెవరెండ్ ఫాదర్ బి.సురేష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉడుముల బాల, సురేష్ బాబు మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో క్రీడా, సాంస్కృతిక రంగాలలో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సీతమ్మధార ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని ప్రోత్సహించటం కోసం వ్యాసరచన, క్విజ్, డిబేట్, చిత్రలేఖనం తదితర పోటీలను కూడా నిర్వహిస్తున్నామన్నారు.

గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించడం ఎంతో అవసరం అన్నారు. ఎస్ఎఫ్ఎస్ ఎడ్యుకేషన్ విభాగం జనరల్ సెక్రటరీ రెవరెండ్ ఫాదర్ ఆంథోనీ స్వామి మాట్లాడుతూ, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాలను సాధించిన కె.పూర్ణిమ, ప్రపంచ అంధుల క్రికెట్‌లో ప్రతిభ కనబరిచిన పి.కరుణకుమారి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విశాఖ నుంచి అవార్డులు అందుకున్న కె.శ్రీనివాస్‌చక్రవర్తి, ఎన్.తేజ, డాక్టర్ పల్లి మాధురి, శ్రీప్రద పోచన పెద్ది, ఆయేషా భాను, ఆర్.హాసిని, బి.శశికుమార్, ఆకుల సాయి సంహిత, కిర్ల యశ్వంత్‌ను సత్కరించారు

## పంచకర్ల ప్రజా దర్బార్‌కు 144 వినతులు

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి నియోజకవర్గం సమస్యలపై సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు ప్రజలు సమస్యలపై 144 వినతులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'అవంతి'లో ముగిసిన జాతీయ సాంకేతిక ఉత్సవాలు

ప్రజాశక్తి -తగరపువలస : అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన గ్యాన్ 2కె25 టెక్ ఫెస్ట్ శనివారంతో ముగిసింది. ఈ సాంకేతిక ఉత్సవంలో వివిధ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ ప్రయోగాలతో నైపుణ్యం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, సమాజంలో ఉన్న వనరులను ఉపయోగించుకొని ప్రతి ఒక్కరూ మారుతున్న పరిస్థితులను బట్టి నూతన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని చెప్పారు.

అవంతి కళాశాలల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. డాక్టర్ కె.చంద్ర భూషణరావు, డాక్టర్ రామరాజు పూసపాటి, బ్రహ్మకుమారి భవాని తదితరులు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో క్వాంటం కంప్యూటరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ రంగంలో ఎక్కువగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన 240 మంది విద్యార్థులకు ముత్తంశెట్టి శ్రీనివాసరావు సుమారు రూ.2 లక్షల విలువైన బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, అడ్మిన్ డైరెక్టర్ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.


సాంకేతిక ఉత్సవాలను ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

# 'విశాఖ'లో కృత్రిమ మేధపై చర్చ


అతిథిని సన్మానిస్తున్న 'విశాఖ' కాలేజీ ప్రతినిధులు

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో 'అల్గం-2025' 9వ అంతర్జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, లాంగ్వేజ్ లెర్నింగ్ మోడల్స్, బయోఇన్ఫర్మాటిక్స్ అప్లికేషన్స్' అంశంపై కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎఐ, ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ విభాగాలు సంయుక్తంగా సదస్సును నిర్వహించాయి. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా అమెరికాలోని వాల్డెన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రఘు కొర్రపాటి హాజరై మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బహుళ విభాగాల (ఇంటర్ డిసిప్లినరీ) పరిశోధనల ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్‌కు చెందిన బయోఆక్సిస్ డిఎన్ఎ రీసెర్చ్ సెంటర్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ అమిత్ కుమార్ మాట్లాడుతూ, జీవ శాస్త్ర పరిశోధనలలో ఎఐ సాంకేతికత పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయవాడ సిద్దార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ కుడిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ, నైతిక విలువలు, నూతన ఆవిష్కరణల ఆవశ్యకతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.ప్రదీప్‌వర్మ మాట్లాడుతూ, నిజజీవిత సమస్యల పరిష్కారానికి సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులు నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ జి.సీతారత్నం, విభాగాధిపతులు డాక్టర్ ఎస్.సి.తేజస్విని కోనే, డాక్టర్ పి.లలితకుమారి, డాక్టర్ టి.వంశీకృష్ణ, డాక్టర్ పివివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## వైభవంగా 'పగల్ పత్తు' ఉత్సవం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం 'పగల్ పత్తు' ఉత్సవాన్ని అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైష్ణవ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన ఈ ఉత్సవాన్ని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు, అధికారులు వేడుకగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవారికి విశేష అర్చనలు, ఆరాధనలు జరిపారు. త్రివ మూర్తులకు ప్రత్యేక అలంకరణలు చేసి, కనులపండువగా వేడుకను పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరావు, పర్యవేక్షణ అధికారి బి.సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధనలతకు జియ్యాని అభినందనలు

ప్రజాశక్తి- వేపగుంట : వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మళ్ల ధనలతను నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అభినందించారు. శాంతినగర్ ఆయన క్యాంపు కార్యాలయంలో ధనలతను ఆయన సత్కరించి, చిరు జ్ఞాపికను అందించారు. పార్టీ బలోపేతానికి మహిళా విభాగం మరింత శక్తివంతంగా పనిచేసేలా కృషి చేయాలని సూచించారు.

## విశాఖ టిడిపి సెక్రటరీగా చిరంజీవి

ప్రజాశక్తి-మధురవాడ : విశాఖ పార్లమెంట్ టిడిపి సెక్రటరీగా కొల్లి చిరంజీవిని అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, పార్టీకి గత 35 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న తన సేవలను గుర్తించి నాయకత్వం ఈ బాధ్యతను అప్పగించిందని తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని చెప్పారు. పదవి రావడంలో సహకరించిన భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# దువ్వాడ పోలీస్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉక్కునగరం : దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపం రాజీవ్‌నగర్ ఫేజ్-1లో నిర్మించిన దువ్వాడ క్రైమ్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, వివిఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్.తేజ్‌భరత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, రాజీవ్ నగర్ పరిసరాలు క్రైమ్ ప్రోన్ ఏరియా కావడం, దువ్వాడ రైల్వే స్టేషన్ అతి దగ్గరలో ఉండడంతో నేరస్తులపై నిఘా పెంచడానికి, స్థానిక ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండటానికి ఈ స్టేషన్ ఎంతగానో ఉపయోగకరమని చెప్పారు. వివిఎంఆర్‌డిఎ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తారన్నారు. తాను గతంలో డిఎస్‌పిగా పనిచేసినప్పుడు పోలీసుల పని భారం, ఒత్తిడి గురించి అవగాహన ఉందని చెప్పారు. విశాఖ సిటీ విస్తరిస్తున్నందున నేర నియంత్రణకు పోలీసు శాఖ విస్తరణ, నైపుణ్యం ఎంతైనా అవసరమన్నారు. నూతన స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చి, చక్కని ప్రాంగణంలో విధులు నిర్వర్తించేందుకు అవకాశం కల్పించిన పోలీసు కమిషనర్‌కు దువ్వాడ క్రైమ్, ట్రాఫిక్ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


పోలీసుస్టేషన్ ప్రారంభంలో శంఖబ్రతబాగ్చి, తేజ్‌భరత్

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార: జివిఎంసి 50వ వార్డు పరిధిలో సుమారు రూ.161.70 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి మేయర్ పీలా శ్రీనివాసరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పన తమ ప్రథమ కర్తవ్యమన్నారు. మాధవదారలోని శ్రీదేవి రెసిడెన్సి, సింగరాయి మెట్ట, మురళీనగర్‌లోని శ్రీదేవి పార్కు తదితర ప్రాంతాలలో విఆర్‌సిసిఎడబ్ల్యు డ్రైన్, ఆర్‌సిసి రిటర్నింగ్ వాల్, వాకింగ్ ట్రాక్, అవుట్ డోర్ ఫిట్నెస్ ఎక్విప్‌మెంట్, వాకర్స్ క్లబ్‌లో నార్త్ సైడ్ కాంపౌండ్ నిర్మాణానికి సుమారు రూ.1.62 కోట్లతో శంకుస్థాపన చేశామన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.రాము, ఇంజినీరింగ్ సిబ్బంది, కూటమి నాయకులు దీపిక, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పీలా, ఎమ్మెల్యే పల్లా

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధి తిరుమలనగర్‌లో కొత్తగా పైపులైన్లు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాధం మాట్లాడుతూ, తిరుమలనగర్‌లో తాగునీటి పైపులైన్ లీకేజీల కారణంగా నీరు వృథా అయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని రోడ్ క్రాసింగ్ ప్రాంతాల్లో కొత్తగా ఎమ్ఎస్ పైపులైన్లను ఏర్పాటుకు జివిఎంసి నిధులు రూ.18.80 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయరామరాజు, బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్‌రాజు, ఆనంద్ కుమార్, కణితి ఈశ్వరరావు, మల్లా రాము, కడుపుట్ల శ్రీను, జాన్ రమేష్, భాగ్యలక్ష్మి, దాలయ్య, ఎటిఎన్.మూర్తి, కల్యాణ చక్రవర్తి, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు పాల్గొన్నారు.

గాజువాక : కూటమి ప్రభుత్వం అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందని జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. జివిఎంసి 70వ వార్డు పరిధి ఎల్‌వి.నగర్‌లో సిసి రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రేటర్ విశాఖను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. గ్రేటర్ పరిధిలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు నాయకులు కొయిలాడ శంకరరావు, ఆడారి రామకృష్ణంరాజు, జోనల్ కమిషనర్ శేషాద్రి, మురళీదేవి పాల్గొన్నారు.

# సమరశీల పోరాటాల్లో సిఐటియు ప్రత్యేక పాత్ర

- సంఘం అఖిల భారత మహాసభ సందర్భంగా 'ప్రజాశక్తి'తో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

**'సిఐటియు ఒక ప్రత్యేక పరిస్థితుల్లో, చారిత్రక సందర్భంలో దేశంలో స్థాపించబడింది. నెహ్రూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి ఒక్క ట్రేడ్ యూనియన్ కూడా నాడు మిగల్లేదు. స్వాతంత్ర్య పోరాటంలో సమరశీలంగా వ్యవహరించిన ఎఐటియుసి నెహ్రూ ప్రభుత్వాన్ని బలపరచడాలని నిర్ణయించడంతో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రశ్నించే ట్రేడ్ యూనియన్ లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికవర్గ హక్కుల కోసం పోరాడే సంస్థగా సిఐటియు ఆవిర్భవించింది' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖ బీచ్ రోడ్డులోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగనున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో సిఐటియు పోరాటాల ప్రత్యేకత, విధానంపై ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..**

**నాటి పరిస్థితులు ఇలా..**

1967లో దేశ వ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రత్యామ్నాయ ప్రభుత్వాలు ఏర్పాటు జరిగాయి. నెహ్రూ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అండగా ఉండని రుజువైన కాలం అది. 1970 మే 31న అనివార్య పరిస్థితుల్లో సిఐటియు ఒక లక్ష్యంగల సంస్థగా ఐక్యతా పోరాటం నినాదంతో స్థాపించబడింది. జూన్‌లోనే దేశ వ్యాప్తంగా కార్మికవర్గ ఐక్యత కోసం పిలుపునిచ్చింది. కానీ ట్రేడ్ యూనియన్‌గా ఏర్పడిన సిఐటియును ఇతర సంఘాలు అవహేళనగా మాట్లేడే పరిస్థితి నాడు ఉండేది. 1970లో ఒక సంఘం అఖిలభారత నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు బోర్డును ఎక్కడ పెడతారంటూ ప్రశ్నించేవారు. అంటే సిఐటియు చాలా నామమాత్రంగా ఉండేదని వారి విమర్శ. 1977 నాటికి దేశ వ్యాప్తంగా వామపక్ష ప్రభుత్వాలు బెంగాల్, కేరళ, త్రిపురలో ఏర్పడ్డాయి. సిఐటియు అత్యంత సమరశీల పోరాటాలు చేసే సంస్థగా కార్మిక సంస్థలు, కార్మికులు గుర్తించారు. 1974లో జరిగిన రైల్వే సమ్మెలో కామ్రేడ్ సమర్ ముఖర్జీ ఛైర్మన్‌గా రైల్వే పోరాటంలో కీలకపాత్ర పోషించారు. ఆర్థిక సంక్షోభాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే పోరాటం సహా కార్మిక ఉద్యమాలను తీవ్రంగా అణచివేసింది. 1976లో ఎమర్జెన్సీని వ్యతిరేకించి నిలబడ్డ ఏకైక కార్మిక సంస్థ సిఐటియు మాత్రమే. తొలి నుంచీ కార్మికుల హృదయాల్లో సిఐటియుది చిరస్మరణీయ స్థానం.

**ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు ప్రారంభ రోజుల్లో...**

రాష్ట్రంలో సిఐటియు ప్రారంభ రోజుల్లో అనేక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంది. సిఐటియు రాష్ట్ర కేంద్రం, ఢిల్లీ కేంద్రం అధ్యక్షులు పర్వా సత్యనారాయణ, నండూరి ప్రసాదరావు నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసింది. శ్రీహరి, లక్ష్మయ్య హైదరాబాద్‌లోని ఎంవి.భాస్కరరావు సహకారంతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో సిఐటియు సంఘాలు అతి వేగంగా నెలకొల్పడం జరిగింది. రాజమండ్రిలో బాలాజీదాస్ నాయత్వంలో పేపర్ మిల్లు పోరాటం, రాయలసీమలో పోరాటం వంటి అనేక ఉద్యమాల ఫలితంగా కార్మికుల ఆదరణ పొందింది.

**టిటిడిలో పోరాటాలు**

నాడు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలోనే రవాణా బస్సులు నడిచేవి. అలాగే అడ్డాలు తయారు చేసే కార్మికుల పని ప్రదేశం (పోటు) పనుల గురించి సిఐటియు పోరాడుతూ వారిని కార్మికులుగా గుర్తించి బోనస్ చెల్లించాలని సుప్రీం కోర్టులో సమస్యను లేవనెత్తి విజయం సాధించడం విశేషం. జస్టిస్ కృష్ణయ్య న్యాయమూర్తిగా ఆనాడు ఉండేవారు. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు హైదరాబాద్, విశాఖలోనే కేంద్రీకరించబడి ఉండేవి. 1990 నాటికి ఈ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో సిఐటియు సంఘాలు ఏర్పాటు చేసి ప్రభుత్వ రంగ కార్మికుల్లో ఒక బలమైన స్థానాన్ని సిఐటియు సంపాదించింది. దీని ఫలితంగా ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాల్లో హైదరాబాద్‌లోని ఐడిపిఎల్, హెచ్ఎంటి కార్మికులు ఎన్నో విజయాలు సాధించారు.

**వందల సంఖ్యలో సంఘాలకు సిఐటియు నాయకత్వం**

విశాఖ ప్రభుత్వ రంగ సంస్థలైన హిందుస్థాన్ షిప్‌యార్డు, పోర్టు, స్టీల్‌ప్లాంట్ వంటి సంస్థల్లో సిఐటియు ఒకటి లేదా రెండు స్థానాల్లో నిలబడింది. ప్రతి జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులను సమీకరించడంలో అద్భుతమైన కృషి చేసింది. భీమవరం కేంద్రంగా రైస్ మిల్లు కార్మికులను, హోటల్స్ హమాలీలను ఇతర అనేక రంగాల కూలీలను సమీకరించి నిరంతర పోరాటాలను నిర్వహించింది. వీటి ఫలితంగా నేడు స్కీం కార్మికులు అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు మొదలుకొని భవన నిర్మాణం, తోపుడు బళ్ళ కార్మికులు సహా చిన్నా, పెద్దా కలిపి 580కి పైగా సంఘాలకు వివిధ రంగాల్లో సిఐటియు నాయకత్వం వహిస్తోంది.



అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ డే వేడుక

## సిఐటియు జెండా నీడన ఐక్య పోరాటాలు మరుపురాని విజయాలు

- స్కీమ్ వర్కర్ల మనోగతం ఇదీ...



భీమిలిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'ఐక్యత పోరాటం' నినాదాన్ని అందిపుచ్చుకుని సిఐటియు జెండా నీడన హక్కుల సాధన, పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి స్కీంవర్కర్ల ఐక్యపోరాటాలు సత్ఫలితాలనే ఇచ్చాయి. గుర్రాలతో తొక్కింపు, పోలీసుల లాఠీల దెబ్బలు, అక్రమ కేసులు, వేధింపులు ఇలా ప్రతికూల పరిస్థితుల్లో కూడా సమరశీల పోరాటాలతో ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు కొన్ని సౌకర్యాలను, హక్కులను సాధించగలిగారు. మొదటి నుంచి తమకు అండదండగా ఉంటున్న సిఐటియు అఖిల భారత మహాసభ నవ్యాంధ్రలో మొదటిసారిగా విశాఖ మహానగరంలో ఈనెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు జరగనున్న నేపథ్యంలో దాన్ని విజయవంతం చేసేందుకు స్కీం వర్కర్లు సన్నద్ధమౌతున్నారు. ఇప్పటికే ర్యాలీలు, సదస్సులు, ఇతర మార్గాల్లో మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం నిర్వహించిన స్కీం వర్కర్లు వచ్చేనెల 4న విశాఖలో జరిగే కార్మిక మహా ప్రదర్శన ర్యాలీ, ఆర్‌కె.బీచ్‌లో బహిరంగసభకు తరలివెళ్లేందుకు సన్నద్ధమౌతున్నారు. సిఐటియు అఖిలభారత మహాసభ నేపథ్యంలో కొందరు స్కీంవర్కర్ల మనోగతమిది.

### పోరాడి హక్కుల సాధన



పిల్లలకు సేవ చేయొచ్చన్న ఆలోచనతో అంగన్వాడీ కార్యకర్తగా ఉద్యోగంలో చేరినా వచ్చిన అరకొర వేతనంతో జీవనం కష్టం కావడంతో సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో దశలవారీగా రూ.2,200 నుంచి నేడు రూ 11,500 వేతనం సాధించుకున్నాం. ఆరోగ్యాంధ్ర నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న అంగన్వాడీలకు ఇంకా పనిభారం, వేతన, ఉద్యోగభద్రత సమస్యలున్నాయి. కనీస వేతనం రూ.26వేలు అమలు, ఉద్యోగభద్రత, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ అమలుకు పోరాటం చేస్తున్నాం. సిఐటియు అండతో ఇప్పటివరకు కొన్ని హక్కులను సాధించుకున్నాం. ఇదేరీతిన సమరశీల పోరాటాలు చేసి మిగతా హక్కులను సాధించుకుంటాం.

**దొంతల కాసులమ్మ,**
**అంగన్వాడీ కార్యకర్త**
**ఆనందపురం**

### పారితోషికం నుంచి వేతనం వరకు...

సిఐటియు జెండా నీడన సమిష్టిగా పోరాటంతో పనికిచ్చే పారితోషికం నుంచి నేడు నెలసరి రూ.పది వేల వేతనం పొందేస్థాయికి చేరుకున్నాం. గర్భిణి పేరు నమోదు, ఆసుపత్రికి తరలింపు, ప్రసవాలు, వ్యాక్సినేషన్ ఇలా చేసిన ఒక్కో పనికి ఇంతమొత్తం అంటూ మొక్కుబడి పారితోషికం ఇచ్చేవారు. వచ్చిన డబ్బుతో ఆసుపత్రికి రానుపోను ఖర్చులకైనా సరిపోయేది కాదు. కుటుంబపోషణ కష్టంగా ఉండేది. సిఐటియు అండతో పోరాటం చేసి నేడు రూ.పదివేల వేతనం సాధించాం. యాప్‌లు, ఇతర పనిభారం పెరిగింది. ప్రభుత్వం ఉద్యోగభద్రత కల్పించి, కనీస వేతనాలు ఇవ్వాలి. ఇఎస్ఐ, పిఎఫ్,గ్రాట్యూటీ ఇతర సౌకర్యాలు అమలు చేయాలి

**పి సూర్యకళ, ఆశా కార్యకర్త**
**తోటవీధి జివిఎంసి మూడోవార్డు, భీమిలి**



గర్భిణిని ఆసుపత్రికి తీసుకొచ్చిన ఆశా సూర్యకళ

### పోరాటం కొనసాగిస్తాం



మధ్యాహ్న భోజన పథకం అమలు తొలినాళ్లలో కర్రల పొయ్యిపై అన్నం, సాంబారు వండి వడ్డించే వాళ్లం. తర్వాత వంటగ్యాస్‌పై వంట చేసే వాళ్ళం. ఆటు తర్వాత అక్షయపాత్ర సంస్థకు వంట నిర్వహణను అప్పగించి, మధ్యాహ్నభోజన కార్మికులకు అన్యాయం చేశారు. కొంతకాలం తర్వాత సిఐటియు ఆధ్వర్యంలో పోరాటంతో రూ.వెయ్యి వేతనం సాధించుకుని తర్వాత రూ.మూడు వేలకు పెంచారు. అయితే వేతన చెల్లింపు సక్రమంగా లేదు. కనీస వేతనం రూ.26వేలు అమలు, ప్రమాదబీమా వర్తింపు, పిఎఫ్, గ్రాట్యూటీ, ఇతర సౌకర్యాలకు పోరాటం కొనసాగిస్తాం

**ఎం.గురమ్మ,**
**మధ్యాహ్న భోజన కార్మికురాలు**
**ఎగువపేట, జివిఎంసి మూడో వార్డు, భీమిలి**

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
ఆదివారం 28 డిసెంబర్ 2025

# ఉత్తేజంగా శ్రామిక ఉత్సవ్

## ఆకట్టుకున్న కళా, విజ్ఞాన, సాహిత్య వేదికలు
## అబ్బురపరిచిన గేయాలు, నృత్యాలు

విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరుగనున్న సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శనివారం నుంచి తలపెట్టిన శ్రామిక ఉత్సవ్ ఘనంగా ఆరంభమైంది. అందరిలో ఉత్తేజం, చైతన్యం నింపింది. ఓ పెద్ద పండగలా ఈ ఉత్సవ్ సాగింది. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి భారీగా కార్మికులు, మేధావులు, కళాకారులు తరలివచ్చారు. ప్రముఖ సినీ నటుడు ప్రకాష్ రాజ్ డప్పు కొట్టి ఉత్సవ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలను ప్రముఖులు ప్రారంభించారు. కళారూపాలతో ఉత్సవ వేదిక హోరెత్తింది.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM


ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు


శ్రామిక ఉత్సవ్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ప్రకాష్ రాజ్



సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్న గుజరాత్ కళాకారులు


పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న. చిత్రంలో ఎంవిఎస్.శర్మ, రమణమూర్తి, తెలకపల్లి రవి , గఫూర్


శ్రామిక ఉత్సవ్ వేదికపై నుంచి నినదిస్తున్న ప్రకాష్ రాజ్, సిహెచ్.నర్సింగరావు, గఫూర్, తెలకపల్లి రవి, రమణమూర్తి, దాడి సత్యనారాయణ, కుమార్, రమాప్రభ తదితరులు





అదరహో అనిపించేలా సాగిన నృత్య ప్రదర్శనలు


నృత్యాలతో ఆకట్టుకున్న పిఎన్ఎం కళాకారులు


దాడి సత్యనారాయణకు జ్ఞాపిక బహూకరణ


ప్రకాష్ రాజ్‌కు విశాఖ విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నాయకులు


కార్టూన్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.నర్సింగరావు


గాజు పెంకులపై నడక


షార్ట్ ఫిల్మ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న సత్యానంద్ తదితరులు

# జ్యూట్ కార్మికోద్యమంలో మైలురాయి 9ఎ పోరాటం

## పాలకుల మెడలు వంచి.. యాజమాన్యం కుయుక్తులను తుత్తునియలు చేసిన 2003 నాటి ఉద్యమం



మూతపడిన చిట్టివలస జ్యూట్ మిల్లు ఇదే..

ప్రజాశక్తి-భీమునిపట్నం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా 2003లో జరిగిన పోరాటం జ్యూట్ కార్మికోద్యమంలోనే ఒక మైలురాయి వంటిది. సముద్రంలో ఉవ్వెత్తున లేచిన కెరటం వలె, చిట్టివలస జ్యూట్ కార్మికులు చేసిన ఈ పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికవర్గంపై తీవ్రంగా ప్రభావం చూపింది. పాలకుల కుట్రలు, యాజమాన్యం కుయుక్తులను జ్యూట్ కార్మికులు తుత్తునియలు చేశారు. 118 రోజుల పాటు జ్యూట్ కార్మిక వర్గం జరిపిన ఈ వీరోచిత పోరాటం స్ఫూర్తిదాయకమైనది.

ఉమ్మడి రాష్ట్రంలోని జ్యూట్ యాజమాన్యాలు పోటీ పడుతూ దాదాపు అన్ని మిల్లుల్లోనూ కార్మిక హక్కులపై దాడి చేసిన కాలమది. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 9(ఎ) కింద కార్మిక హక్కులను హరించే 13 అంశాలతో చిట్టివలస జ్యూట్ యాజమాన్యం నోటీసు జారీ చేసింది. ఇది 2003 జూన్ 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించింది. ఇందులో డిఎలో ప్రతిష్టంభన, పని భారం పెంపు, ఉత్పత్తితో జీతాలను ముడిపెట్టడం లాంటి ప్రధానమైన కార్మిక వ్యతిరేక చర్యలు ఉన్నాయి. ఈ విధానాలను యథేచ్ఛగా అమలుకు పూనుకోవడంతో సిఐటియు కార్మిక వర్గ ఐక్య పోరాటాలకు సిద్ధమైంది. ఆ సమయంలో చిట్టివలస జ్యూట్ మిల్లులో చిట్టివలస జ్యూట్ మిల్స్ మెకానికల్ వర్కర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గుర్తింపు సంఘంగా ఉంది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా అప్పట్లో ప్రతిపక్ష కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘటిత పోరాటాలను నడపడంలో, సమరశీలతను ప్రదర్శించడంలో సిఐటియు కీలక పాత్ర పోషించింది. 9(ఎ) నోటీసుకు వ్యతిరేకంగా వివిధ రూపాల్లో కార్మిక వర్గం పోరాటాలు చేసింది. ఇదే సమయంలో 2003 సెప్టెంబర్ 7న అప్పటి టిడిపి ప్రభుత్వంలో కార్మిక శాఖా మంత్రిగా ఉన్న బాబూమోహన్‌కు విశాఖ ప్రభుత్వ అతిథి గృహం వద్ద వినతిపత్రం ఇవ్వడానికి ప్రయత్నం చేయగా, అనుమతించకపోవడంతో అక్కడే ఆందోళన చేపట్టారు. సెప్టెంబర్ 8న మంత్రి బాబూమోహన్ విశాఖ నుంచి విజయనగరం కారులో రాత్రివేళ వస్తుండగా తగరపువలస హైవేపై జ్యూట్ కార్మికులు ఆయన్ను ఘరావ్ చేశారు. సెప్టెంబర్ 16న జైల్ భరో నిర్వహించారు. ఈ సందర్భంగా 118 మంది కార్మికులను పోలీసులు అరెస్ట్ చేశారు. అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించకపోవడంతో సెప్టెంబర్ 21న తగరపువలస జంక్షన్‌లో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటిని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని నాటి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బివి.రాఘవులు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వీరయ్య, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వివి.రామారావు, కాంగ్రెస్ నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఇటువంటి సమయంలో సెప్టెంబర్ 24న ప్రభుత్వం జ్యూట్ ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. అర్ధరాత్రి నిరవధిక దీక్షా శిబిరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. పోలీసులు బూటు కాళ్ళతో తొక్కి, లాఠీఛార్జ్ చేసి దీక్షా శిబిరంలో భయానక వాతావరణం సృష్టించారు. ఆరోగ్యం క్షీణించిందన్న కారణంతో దీక్షలు చేస్తున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, గుర్తింపు సంఘం నాయకులు ఎస్.రమేష్, జ్యూట్ కార్మిక సంఘాల నేతలు బాబూరావు, అప్పలరెడ్డిలను కేజీహెచ్‌కు తరలించారు. అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్మికులపై అమానుషంగా లాఠీచార్జ్ చేసి 70 మంది కార్మికులను అరెస్ట్ చేశారు. సిఐటియు నేత ఎస్.రమేష్ మెడపై పోలీసులు బూటు కాళ్లతో తొక్కడం పోలీసు దమనకాండకు నిదర్శనం. అప్పటి ప్రభుత్వ, పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా, జ్యూట్ కార్మిక పోరాటానికి సంఘీభావం తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన రంగాల కార్మికులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. కెజిహెచ్ నుండి వచ్చి కలెక్టరేట్ వద్ద దీక్షలు చేశారు. అనంతరం మళ్లీ తగరపువలసలో దీక్షలను ప్రారంభించారు. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వం, యాజమాన్యం దిగొచ్చాయి. సెప్టెంబర్ 26న 9 (ఎ) నోటీసులోని కార్మికులకు నష్టం చేసే అంశాలను యాజమాన్యం ఉపసంహరించుకుంది. జ్యూట్ కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. అప్పటి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజశర్మ చేతుల మీదుగా గ్లూకోజ్ నీళ్ళు ఇచ్చి సిహెచ్.నరసింగరావు చేపట్టిన దీక్షను విరమింపజేశారు. సెప్టెంబర్ 27న సాయంత్రం 7గంటలకు విజయోత్సవసభ నిర్వహించారు. జ్యూట్ కార్మిక వర్గం జరిపిన పోరాటం రాష్ట్ర జ్యూట్ కార్మికోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని ఇప్పటికీ జ్యూట్ కార్మికులు చెప్పుకుంటున్నారు.



తగరపువలస జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు (ఫైల్ ఫోటో)

### యాజమాన్యం కవ్వింపు చర్యలు.. అడ్డుకున్న సిఐటియు

సిఐటియు గుర్తింపు సంఘంగా ఉన్న ప్రతి సందర్భంలోనూ జ్యూట్ యాజమాన్యం అనేక రూపాల్లో కార్మికులపై కవ్వింపు చర్యలకు పాల్పడేది. క్యాంటీన్ రేట్లు పెంచేందుకు, పలు డిపార్ట్‌మెంట్లలో కార్మికులపై పని భారం పెంచేందుకు యాజమాన్యం పలు సందర్భాల్లో జరిపిన ప్రయత్నాలను సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు అడ్డుకున్నారు. ఇలా యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడ్డ ప్రతి సందర్భంలోనూ కార్మికులు కలిసి కట్టుగా ప్రతిఘటించారు.



జ్యూట్ కార్మికుల నిరవధిక దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు (ఫైల్ ఫోటో)

# షిప్‌యార్డు ప్రైవేటీకరణకు అడ్డుకట్ట




- సిఐటియుది గొప్ప పోరాటం
- జాతీయ మహాసభ విజయవంతానికి కార్మికులు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ఈ నెల 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకూ జరుగనున్న సిఐటియ జాతీయ మహాసభలు అత్యంత కీలకమైనవని, విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)ను ప్రయివేటీకరణకు గురికాకుండా కాపాడడంలో ఏళ్లతరబడి సిఐటియు సాగించిన ఉద్యమాలను ఈ సందర్భంగా షిప్‌యార్డు కార్మికులు, ఉద్యోగులు గుర్తుకు తెచ్చుకుంటున్నారని **షిప్‌యార్డు లేబర్ అండ్ స్టాఫ్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు వి.ప్రసాద్** వెల్లడించారు. సిఐటియు మహాసభ సందర్భంగా ప్రసాద్ ప్రజాశక్తితో మాట్లాడుతూ, షిప్‌యార్డులో యూనియన్ స్థాపించిన నుంచి నేటివరకు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా షిప్‌యార్డు ప్రయివేటుపరం కాకుండా కాపాడుకున్నట్లు తెలిపారు. పోరాటాలకు సంబంధించి ఆయన మాటల్లోనే...

### జిఎంఎల్ ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర...

కేంద్ర ప్రభుత్వం జిఎంఎల్ ప్రయివేటు సంస్థకు కట్టబెట్టాలని చూడగా ప్రభుత్వ రంగంలో కొనసాగేలాగ సిఐటియు కృషి చేసి నిలువరించింది. సిపిఎం నేత సీతారాం ఏచూరి చేసిన కృషి షిప్‌యార్డు విషయంలో ఎనలేనిది. డిఫెన్స్‌లో విలీనం చేసేంతవరకూ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలు, షిప్‌యార్డు రక్షణకు ఎంతగానో తోడ్పడ్డాయి. దేశంలో ఎక్కడా పర్మినెంట్ రిక్రూట్‌మెంట్ లేని రోజుల్లో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌కె మిశ్రా సహకారంతో 275మందిని సిఐటియు పర్మినెంట్ చేయించింది. సిఐటియు కృషితో 5 ఫ్లీట్ సపోర్టు షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్)ల వర్క్ ఆర్డర్స్ షిప్‌యార్డుకు దక్కింది. సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిఫెన్స్ మినిస్ట్రీకి లేఖ రాస్తూ పెండింగ్‌లో ఉన్న 5 ఎఫ్‌ఎస్‌ఎస్‌లు హిందుస్థాన్ షిప్‌యార్డుకు కేటాయించాలని కోరారు.

### ప్రభుత్వ విధానాలతో పర్మినెంట్ ఉద్యోగుల తరుగుదల...

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రయివేటీకరణ విధానాల వల్ల పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. 2010లో పర్మినెంట్ ఉద్యోగులు 4వేల మంది ఉండగా నేటికి 310కి కుదింపబడ్డారు. ప్రధాన డిపార్టమెంట్‌లన్నీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోవడంతో యార్డులో కాంట్రాక్టీకరణ పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డును ఈ విధంగా ప్రయివేటీకరణ చేసేందుకు శతవిధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. ఈ ప్రయివేటీకరణ విధానాలపైనా, షిప్‌యార్డును పూర్తిగా ప్రభుత్వ రంగంలో నిలిపేందుకు సిఐటియు సాగిస్తున్న అవిరళ కృషి అజరామరమైనది.

### ప్రయివేటుకు షిప్‌ల కాంట్రాక్టును వ్యతిరేకిస్తున్న సిఐటియు

5 ఎఫ్‌ఎస్‌ఎస్‌ల వర్క్ ఆర్డర్ షిప్‌యార్డుకు వచ్చినప్పటికీ అందులో 2 ఎల్‌అడ్‌టికి కేటాయించడాన్ని సిఐటియు మొదటనుంచీ వ్యతిరేకిస్తూ పోరాడుతోంది. దీనివల్ల షిప్‌యార్డు ఆర్థికంగా నష్టపోతుంది. 4 ఎల్‌పిడిఎస్ 2012లో హెచ్‌ఎస్‌ఎల్‌కు కేటాయిస్తామని గతంలో కేంద్ర ప్రభుత్వం చెప్పింది. డిఫెన్స్ అక్విజేషన్ కమిటీ (డిఎసి) కూడా రూ.33వేల కోట్లతో 4 ఎల్‌పిడిఎస్‌ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. హిందుస్థాన్ షిప్‌యార్డుకే ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. పెట్రోలియం, సహజవాయువులు, ఉక్కు, ఎరువుల రంగాలు, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో కలిసి 207 షిప్పులను షిప్‌యార్డు నిర్మించాలని ప్రణాళిక రచించడం మంచి పరిణామం. దీంట్లో ట్యాంకర్లు, బల్క్ కారియర్‌లు, లైనర్లు, అప్‌షోర్ సరఫరా నౌకలతో సహా 55 నౌకలు ఉన్నాయి. ఇతర అన్ని రకాల 800 షిప్‌లు దేశానికి అవసరమని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ షిప్పులు ఇవ్వడానికి హెచ్‌ఎస్‌ఎల్‌ను పరిగణలోకి తీసుకోవాలని సిఐటియు పోరాడుతోంది.

### ఎల్‌అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల పర్మినెంట్...

348 ఎల్‌అండ్ ఎం సిరీస్ ఉద్యోగులు షిప్‌యార్డులో పనిచేస్తున్నారు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ నుంచి వచ్చిన ఉద్యోగులు, మెడికల్ డెత్ డిసీజ్డ్ ఎంప్లాయీస్ కలిపి 670 మంది ఉండేవారు. దీంట్లో 2014లో 149 మందిని పర్మినెంట్ చేయాలని దఫదఫాలుగా యాజమాన్యాన్ని సిఐటియు కోరుతోంది. కొంతమందిని పర్మినెంట్ చేసి మిగిలిన వారిని పర్మినెంట్ చేయకుండా ఉంచడం ఆర్టికల్ 14 ప్రకారం వివక్ష చూపడమే కావున మిగతా వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తోంది.

### షిప్‌యార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి...

దేశంలోనే అతిపురాతనమైన తొలి నౌకా నిర్మాణ కేంద్రం హిందుస్థాన్ షిప్‌యార్డు. దీంట్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సిఐటియు తొలినుంచీ పోరాడుతోంది. కేంద్ర ప్రభుత్వం షిప్‌యార్డు అభివృద్ధికి సుమారు రూ.19వేల కోట్లు కేటాయించింది. షిప్‌యార్డు కంపెనీ, షిప్‌యార్డు కాలనీ కలిపితే 281 ఎకరాల భూమి. విశాఖ పోర్టు నుంచి 99 ఏళ్ల లీజుకు తీసుకుంది. ఆ లీజు కొన్ని సంవత్సరాల్లో పూర్తవుతున్నందున ఆ భూమి మొత్తం షిప్‌యార్డులోకి మార్చాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. న్యాయబద్ధంగా స్టాఫ్ అండ్ వర్క్‌మెన్‌లకు ప్రమోషన్లు కల్పించాలని 10ఏళ్లుగా సిఐటియు పోరాడుతోంది. పదోన్నతులు ఇవ్వకుండా ఏళ్లతరబడి ఒకే కేటగిరిలో ఉంచడాన్ని వ్యతిరేకిస్తోంది. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్‌ఐ సక్రమంగా అమలు చేయాలని సిఐటియు పోరాడుతూనే ఉంది.

# మహాసభ జయప్రదానికి 2కె రన్

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ శనివారం అచ్యుతాపురంలో 2కెరన్ నిర్వహించారు. 100 మంది యువత పాల్గొన్న 2కెరన్‌ను స్థానిక ఎస్ఐ ఎం.వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు ప్రథమ, ద్వితీయ ,తృతీయ స్థానాల్లో గెలుపొందిన యువతి యువకులకు డాక్టర్ అడిగర్ల సుధీర్ , డాక్టర్ ధర్మిరెడ్డి వెంకట్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారి జరుగుతున్నాయని, ఈ మహాసభల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను చర్చించి భవిష్యత్తు పోరాటాలు రూపొందిస్తారన్నారు.. సిఐటియు అంటే పోరాటాలు ఒక్కటే కాదు, ప్రజల్ని చైతన్యం చేసే బాధ్యత కూడా ఉందని, అందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ కూండ్రపు విమల వెంకు నాయుడు మాట్లాడుతూ, సిఐటియు ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో అచ్యుతాపురం ఎంపిటిసి ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల చైర్మన్ డి ప్రసాద్, నిర్వాహకులు ఆర్ అరుణ్ జె అప్పలరాజు, కె వంశీ, కడారి ఉమా శంకర్ సిహెచ్ మోహన్ రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు, జెవివి నాయకులు వెంకటఅప్పారావు, రైతు సంఘం అధ్యక్షులు కర్రి అప్పారావు, కే రామ సదాశివరావు, కోచ్చు ఎం తులసిరావు, కే వెంకట్, రమణ, శివాజీ, ఆర్ లక్ష్మి, ప్రశాంతి కాలేజీ ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.


చిట్టివలస నుంచి కవాతు చేపట్టిన రెడ్ షర్ట్ వాలంటీర్లు

## రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు

తగరపువలస : సిఐటియు అఖిలభారత 18వ మహాసభల నేపథ్యంలో భీమిలి సిఐటియు జోన్ కమిటీ ఆధ్వర్యాన రెడ్‌షర్ట్ వాలంటీర్లు చిట్టివలస సిఐటియు కార్యాలయం నుంచి కవాతును చేపట్టారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నంలో భారీ కవాతు చేయనున్న నేపథ్యంలో చిట్టివలస సిఐటియు కార్యాలయం నుంచి కవాతు చేపట్టారు. బంతాటమైదానం, తగరపువలస మెయిన్ రోడ్డు, బైపాస్ వైఎస్ఆర్ విగ్రహం, తాత థియేటర్, మార్కెట్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా మళ్లీ సిఐటియు కార్యాలయానికి కవాతు చేరుకుంది. ఈ కవాతును డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా నాయకులు రాజు ప్రారంభించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, భీమిలి జోన్ కార్యదర్శి ఎస్.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు రవ్వ నర్సింగరావు, పంపాన సూర్యనారాయణ, మండల కార్యదర్శి నేలాతు రాము, పల్ల పెంటరాజు, నమ్మి నాయుడు, గుజ్జు నర్సింగరావు, ఆటో, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

# ఒకే కాన్పులో రెండు దూడల జననం


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలం లోని తెనుగుపూడి శివారు రొంగలి పేటకు చెందిన సింగంపల్లి బంగారయ్య అనే రైతుకు చెందిన ఆవు శుక్రవారం రాత్రి రెండు దూడలకు జన్మనిచ్చింది. తల్లి ఆవుతోపాటు రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు. ఒకే కాన్పులో రెండు పెయ్యిలు జన్మించడం పట్ల రైతు ఆనందం వ్యక్తం చేశారు.

దీనిపై పశువైద్యాధికారిణి కె. మంజుషారాణి మాట్లాడుతూ, కృత్రిమ గర్భధారణ సమయంలో ఒక అండాశయాన్ని, ఒక వీర్యం కలవడం ద్వారా ఒక పెయ్యి జన్మించడం సహజంగా జరుగు తుందని, అయితే ఒకేసారి రెండు అండాశయాలు విడదలై, రెండు వీర్యాలతో కలవడం వల్ల రెండు పెయ్యిలు జన్మించే అవకాశం అరుదుగా జరుగుతుందన్నారు. ఇటువంటి కాన్పులు ఏడు శాతం వరకు సంభవిస్తుంటా యన్నారు.

## ప్రమాదాల నియంత్రణకు స్టాపర్స్ వితరణ

ప్రజాశక్తి -కశింకోట: కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా వాహనాల వేగ నియంత్రణకు ఉపయోగపడే విధంగా 25 స్పీడ్ స్టాపర్స్‌ను నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం సిఐ స్వామి నాయుడుకు శనివారం అందజేసారు.ఈ సందర్భంగా సిఐ స్వామినాయుడు మాట్లాడుతూ, స్పీడ్ స్టాపర్స్ అందించిన నాగార్జున సిమెంట్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వీటిని అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా భద్రతకు పోలీసులు చేపట్టే చర్యలకు పరిశ్రమలు సహకారం అందించడం అభినందనీయమని సిఐ తెలిపారు. నాగార్జున సిమెంట్ ప్రతి నిధులు పాల్గొన్నారు

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ :యలమంచిలి పట్టణ పరిధిలో ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 14మంది వాహనదారులను పట్టుకుని పోలీస్ స్టేషన్ తరలించారు. వారిపై తగిన సెక్షన్ల ప్రకారం ఎం వి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. ఫైన్ అనంతరం యలమంచిలి సిఐ ధనుజయరావు వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కొక్కిరేపల్లి హైవేలో ఏర్పాటుచేసిన, సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులకు ఫైన్ విధించడంతోపాటు వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలుతప్పవన్నారు. 26న ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన ఆరుగురికి ఫైన్ విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ శతాబ్ది వార్షికోత్సవం

ప్రజాశక్తి - పాయకరావుపేట:: సిపిఐ శతాబ్ది వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని సత్యవరం, కుమారపురం, పెద్దూరులో పార్టీ జెండాలు ఆవిష్కరణ చేశారు. పాయకరావుపేటలో కొప్పినీడి ఆదినారాయణ శాస్త్రి పతాకాన్ని ఆవిష్కరించగా,పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రావు జగ్గారావు, మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, గోవిందు, రమణ, ఈశ్వరావు, వీరగోవిందు, భూలోకయ్య, శివకేశవ రావు, సత్యనారాయణ, మల్లి, యేసు, నూకరాజు, నాగేశ్వరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

### ముగింపు సభను జయప్రదం చేయండి

అనకాపల్లి : సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మంలో జరిగే ర్యాలీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా నాయకులతో కలం ఖమ్మంలో జరిగే ర్యాలీ, బహిరంగ సభకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి ఫణీంద్ర, వియ్యపు రాజు, బి బాబ్జి, కోరిబిల్లి శంకరరావు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయమూర్తి



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి నరేష్

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : అనకాపల్లి సబ్ జైలును శనివారం పదో అదనపు జిల్లా జడ్జ్ నరేష్ సందర్శించారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో జైలును సందర్శించి నిందితులతో మాట్లాడారు. జైలుకు రావడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జైలు జీవితం తర్వాత ప్రవర్తనలో మార్పు రాకపోతే పిడి యాక్ట్ పెడతారన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కావాలంటే ఏర్పాటు చేస్తా మన్నారు. న్యాయ సహాయకులు సాయిరాం, తులసి, కె.రోజా, ఇంచార్జి సూపరింటెం డెంట్ జగన్నాథం, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సంధ్య పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ములకలపల్లి గ్రామంలో ఇటీవల షైక్ ఈశ్వరమ్మ ఇళ్లు అగ్నికి దగ్ధం కాగా, శనివారం అగ్ని ప్రమాద బాధితులకును దేవరపల్లి మండల జనసేన అధ్యక్షులు గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు, సీనియర్ నాయకులు ముర్రు ఈశ్వర్ పరామర్శించారు. బాధితులకు రూ.పదివేలు ఆర్థిక సహాయం అందజేశారు. నెలకు సరిపడా నిత్యవసర సరుకులు మండల ఉపాధ్యక్షులు ఇంటి సురేష్ అందజేశారు.కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తామరణ సూరిబాబు , టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ వెంకన్న దొర, స్కూల్ కమిటీ చైర్మన్ చామంతులు జగ్గారావు, జనసేన నాయకులు గొర్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. శనివారం పల్లె పండుగ 2.0 లో భాగంగారేబాక గ్రామంలో పాలిటెక్నిక్ కాలేజ్ వరకు, అలాగే బగులవాడ గ్రామంలో రూ. 70 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద జగదీశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి చదరం నాగేశ్వర రావు, గంగుపాం జగదీష్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కర్రి బాబి, తలారి కాశీనాయుడు, మాటూరు సన్యాసమ్మ, గనిరెడ్డి రాజు, కరణం నాయుడు,కూటమి నాయకులు, అ పాల్గొన్నారు.

కశింకోట :మండలంలోని తీడ, కొన్నూరుపాలెంలో పల్లె పండగ 2.0 కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్ల నిర్మాణం, పలు అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ ప్రజలు, కూటమి కార్యకర్తల నుంచి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొణతాల

సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. వాటిపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందా సత్య నారాయణ, రాష్ట్ర గవర కార్పరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీష్, మండల టీడీపీ అధ్యక్షులు గొంతిన శ్రీను వాసరావు, కాయలు మురళి, ఉగ్గిని రమణ మూర్తి, వేగి గోపికృష్ణ, కలగాసోమేశ్వరరావు కూండ్రపు రాము నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

# 31న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెల ఒకటిన ఇవ్వాల్సిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగా ఈ నెల 31 బుధవారం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు. 31న బుధవారం ఉదయం 6 గంటల నుంచే జిల్లాలో అన్ని గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తారన్నారు. దీనికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 30న నగదు విత్‌డ్రా, ఇతర చర్యలు చేపట్టాలని డిఆర్‌డిఎ.ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి, గ్రామ వార్డు సచివాలయాల సమన్వయ అధికారి మంజులవాణిలను ఆదేశించారు.

యలమంచిలి టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెల ఎన్టీఆర్ సామాజిక భద్రతా భరోసా పింఛన్లను ఒక రోజు ముందుగా ఈనెల 31న బుధవారం పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తెలిపారు.లబ్ధిదారులు గమనించాలని కోరారు.

## మండల స్థాయి షటిల్ టోర్నీ

ప్రజాశక్తి -కశింకోట : వచ్చేనెల 4న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 31, జనవరి ఒకటి తేదీల్లో మండల స్థాయి షటిల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపిటిసి దాడి నాగరాజు, పెంటకోట గోవింద తెలిపారు ఈ టోర్నమెంట్‌ను జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాల్లో భాగంగా నాలుగో రోజు శనివారం అసకపల్లి పంచాయతీ నక్కవానిపాలెం గ్రామంలో వీర్ బాల్ దివాస్, మిషన్ వాత్సల్యకు సంబంధించి, మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, జ్ఞానంతో కూడిన ఆటలతోపాటు మ్యూజికల్ చైర్ పోటీలను కూడా నిర్వహించారు. స్థానిక హెచ్ఎం మల్లేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - పరవాడ: మహిళలు, పిల్లలపై లైంగిక నేరాల నివారణ లక్ష్యంగా వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో, విప్రో కేర్స్ సహకారంతో, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ తోడ్పాటుతో పరవాడ మండల పరిషత్ కార్యాలయంలో పోక్సో చట్టంపై శనివారం అవగాహన కల్పించారు. ఎంపిడిఒ రమేష్ నాయుడు సమన్వయం చేసిన కార్యక్రమంలో 2012లో అమల్లోకి వచ్చిన పోక్సో చట్టం నేపథ్యం, ఉద్దేశ్యం, అమలు విధానాలపై అవగాహన కల్పించారు.

పిల్లల హక్కుల పరిరక్షణ, తప్పనిసరి ఫిర్యాదు విధానం, ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు వంటి అంశాలను స్పష్టంగా వివరించారు. పిల్లల రక్షణ కోసం సమాజం, పోలీసులు, న్యాయవ్యవస్థ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని వక్తలు అన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ లలిత కుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎస్‌కేలు, ఎంఇఒ ఎం.ద్వారకరావు, తహసీల్దార్ బి.నాగరాజు, డిప్యూటీ ఎంపీడీఓ, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, స్వయం సహాయక సంఘాల నాయకులు, ఎల్ఎల్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి-అనకాపల్లి : కుంచావారి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గౌరీ పరమేశ్వరులను మహోత్సవం సందర్భంగా అమ్మవారి ప్రత్యేక అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర ఫైనాన్స్, మౌలిక వసతులు చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి దాడి రత్నాకర్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, సీఎం రమేష్ మేనల్లుడు రాజేష్, కార్పొరేటర్లు మాదంశెట్టి చిన్న తల్లి నీలబాబు, వైసిపి నాయకులు మలసాల రమణారావు, పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు అమ్మవారిని దర్శించుకున్నారు ఆలయ కమిటీ చైర్మన్ ఎం వీరభద్రరావు (అబ్బులు), కోశాధికారి కర్రి కృష్ణ గౌరవ అధ్యక్షులు పొండంగి సత్యరావు, కోరుకొండ సాంబశివరావు, కొమ్మోజు రామకృష్ణ, పాలూరి శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అసాధారణ జ్ఞాపకశక్తికి గుర్తింపు

## ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీభారతికి చోటు

**ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్** : చిన్న వయసులోనే అసాధారణ జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తూ అనకాపల్లికి చెందిన పొన్నా సోమేష్ మనుమరాలు పొన్నా శ్రీభారతి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటుచేసుకుంది. ఒక సంవత్సరం 8 నెలల వయస్సున్న శ్రీభారతి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. పండ్లు, కూరగాయలు , జంతువులు, వాహనాలు, శరీర భాగాలు, ఇంగ్లీష్ అక్షరాలు, ఇతర వస్తువులు కలిపి 250కి పైగా చెబుతున్న భారతి ప్రతిభను ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అధికారికంగా ధ్రువీకరించి 'అచీవర్' సర్టిఫికెట్‌ను అందజేశారు. చిన్న వయసులోనే తమ కుమార్తెకు జాతీయ స్థాయి గుర్తింపుపై శ్రీభారతి తల్లిదండ్రులు పొన్నా సోమేష్ హర్ష, వర్షిత ఆనందం వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుండే వస్తువులను గుర్తించడంలో భారతి చూపుతున్న ఆసక్తిని గమనించి, ప్రోత్సహించినట్లు తెలిపారు. భారతి సాధించిన విజయాన్ని చూసి గర్వపడుతూ, ఆమెకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.



అచీవర్ సర్టిఫికెట్‌తో చిన్నారి భారతి

# జాబ్‌మేళాలో 83 మందికి ఉద్యోగాలు

**ప్రజాశక్తి-యస్ రాయవరం** : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలో అడ్డురోడ్డులో ఎస్‌విఎస్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాలను నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ రాపర్తి రాము తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి సమన్వయ కర్త కొప్పిశెట్టి వెంకటేష్ పాల్గొని జాబ్ మేళా సద్వినియోగంచేసుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ గోవిందరావు మాట్లాడుతూ జాబ్ మేళాకు 17 ఎమ్మెన్సీ కంపెనీలు పాల్గొన్నాయని, 182 మంది నిరుద్యోగ యువత జాబ్‌మేళాకు రాగా, వారిలో 83 మందిని వివిధ కంపెనీలకు ఎంపిక చేశారన్నారు.ఎంపిపి కె.వెంకటలక్ష్మి, జడ్పిటిసికాకర్ల దేవి, టి డి పి మండల అధ్యక్షులు అమలాకంటి అబ్బుద్ధం, పిఎసిఎస్ చైర్మన్ గుర్రం రామకృష్ణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటరాజు, ఎ.నర్సింహామూర్తి, వై. రమణ పాల్గొన్నారు.

# గాయపడిన కార్యకర్తకు పరామర్శ

**ప్రజాశక్తి - పరవాడ** : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, గాజువాక ఆర్‌కే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని రావాడ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కోర్నీ రవి యాదవ్‌ను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శనివారం ఆసుపత్రికి వచ్చి పరామర్శిచారు. రవి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్‌పిటిసి పైల సన్యాసిరాజు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు పాల్గొన్నారు.

# తాతయ్యబాబుకు అభినందన

**ప్రజాశక్తి- దేవరాపల్లి** : అనకాపల్లి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన బత్తుల తాతయ్యబాబును ఆ పార్టీ దేవరాపల్లి మండల నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, కార్యదర్శి దొగ్గ దేముడునాయుడు,మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, శరకాన సూర్యనారాయణ, సోమిరెడ్డి గోవింద, గుల్లిపల్లి అర్జున, గుళ్ళపల్లి మురళి, గొర్లె గోవింద, పెంటకోట అప్పలనాయుడు, చల్లా తాతీయ్యలు, గంధం జగ్గారావు, సాంబమూర్తి, రెడ్డి బలరాం, చామంతుల వెంకన్నదొర, చామంతుల సన్యాసిరావు(బాలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

**ప్రజాశక్తి- కోటపాడు:** ధనుర్మాసం సందర్భంగా మండలంలోని చౌడువాడ గ్రామంలో శతకం పట్టు రామాలయం, గవరపేట రామాలయం పరిధిలో ప్రతిరోజు తెల్లవారుజాము భక్తి భావంతో మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. భగవత్ నామ సంకీర్తనలు చేసుకుంటూ గ్రామప్రదక్షిణ చేస్తున్నట్లు మేలుకొలుపులు పాటల గురువు సూరిశెట్టి రమణ కోరారు.

# ఎంఎస్ఎంఇ ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన, వినతి

**ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ :** అచ్చుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఎఎస్ఎంఈ కాలేజీలో విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ కాలేజ్ జిఎమ్‌ను కలిసి విన్నవించారు. ఎంఎస్ఎంఈ కాలేజీలో విద్యార్థులతో ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకష్ణ వ్యవహరిస్తున్న తీరుపై వివరించారు.
ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం బాలాజీ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ కాలేజీ ప్రిన్సిపల్ విద్యార్థుల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం, అదేవిధంగా అధ్యాపకులు కూడా విద్యార్థులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. ఫీజులు చెల్లిస్తే తప్ప హాల్ టికెట్లు ఇవ్వబోమని, పరీక్షలకు అనుమతి ఉండదని బెదిరిస్తున్నారన్నారు.కాలేజీలో ఎటువంటి స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్స్ కార్యక్రమాలు నిర్వహించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

# రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి -వడ్డాది** : రీసర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్వే ఏడీ గోపాలరాజు కోరారు. శనివారం వడ్డాదిలో సర్పంచ్ కె..కామలక్ష్మీ అధ్యక్షతన రీసర్వే గ్రామసభ నిర్వహించారు. వచ్చే నెల 2 నుంచి వడ్డాదిలో రీసర్వే ప్రారంభిస్తామన్నారు. సర్వేకు సంబంధిత రైతులు అందుబాటులో ఉండాలన్నారు.ముందస్తు సమాచారం అందిస్తామన్నారు. తహసిల్దార్ ఎం.లక్ష్మీ మాట్లాడుతూ రీసర్వే వలన సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వడ్డాదిలో ఇనాం భూములుగా నమోదైన జిరాయితీ భూముల సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రతి రైతుకు నిర్దిష్టమైన కొలతలు, ఆన్‌లైన్, జియో కోడ్‌తో పట్టాదారు పాస్ పుస్తకం, మ్యాపు అందిస్తామన్నారు .రీసర్వే పూర్తయితే ఆక్రమణలకు ఆస్కారం ఉండదని, క్రయవిక్రయాల సమయంలో సమస్యలు ఉత్పన్నం కావన్నారు.గ్రామ పెద్దలు వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, స్టేట్ గ్రంథాలయ పరిషత్ మెంబర్ సిరిగిరి శెట్టి శ్రీరామూర్తి, టిడిపి నేత దొండా గిరిబాబు, ఎంపీటీసీ కోరుకొండ రమణ,దాడి చిన గోవింద, కాంగ్రెస్ నేత సత్యనారాయణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ముందస్తు సమాచారం, దండోరా లేకుండా గ్రామసభ నిర్వహించడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. దీనిపై తహసిల్దార్ స్పందిస్తూ, వచ్చే మంగళవారం మరోసారి వడ్డాదిలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు. లులూరుకు సంబంధించి లోపూడిలో గ్రామసభ నిర్వహించారు.ముందస్తు సమాచారం, దండోరా లేకుండా గ్రామసభ నిర్వహించడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. దీనిపై తహసిల్దార్ స్పందిస్తూ, వచ్చే మంగళవారం మరోసారి వడ్డాదిలో గ్రామసభ నిర్వహిస్తామన్నారు.

# మహిళల ఆరోగ్య సమస్యలపై అవగాహన

**ప్రజాశక్తి-అనకాపల్లి** : మహిళలు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని వివేకానంద చారిటబుల్ ట్రస్టు సభ్యురాలు డాక్టర్ పావని సూచించారు. శనివారం జివిఎంసి బాలికల ఉన్నత పాఠశాలలో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె విష్ణుమూర్తి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్ కాండ్రేగుల పావని పాల్గొని విద్యారినులకు బాల్యం, కౌమారం, యవ్వన దశల్లో వచ్చే ఆరోగ్య సమస్యలపె అవగాహన కల్పించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి సూర్యకృష్ణ, ఉపాధ్యాయులు రామచంద్రరావు, రమాదేవి పాల్గొన్నారు.

# శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

**ప్రజాశక్తి - యలమంచిలి :** రాబోయే వార్షిక పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారి మద్దిలి వినోద్‌బాబు ఆదేశించారు. శనివారం యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత ఉపాధ్యాయుల ఓరియెంటేషన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని సలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ మాట్లాడుతూ ఓరియంటేషన్ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు బాధ్యాయుతంగా గణితాన్ని బోధించాలని కోరారు. శిక్షణలో 21 మంది గణితఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

**ప్రజాశక్తి- పరవాడ:** ప్రజల సమస్యలకు పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. శనివారం సుజాతనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను పలువురు ఎమ్మెల్యే దష్టికి తెచ్చారు. పరవాడ మండలం, ముత్యాలమ్మ పాలెం గ్రామపంచాయతీ సమస్యలపై ఆంధ్రా మత్స్యకార జెఎసి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అర్జిల్లి అప్పలరాజు వినతిపత్రం సమర్పించారు గ్రామంలోని ప్రభుత్వ భూములు, భవనాలు, మత్స్య శుద్ధి కేంద్రాలు, గ్రామ పంచాయితీ కార్యాలయం, బోర్లు తదితరాలను అక్రమ ఆక్రమణల నుంచి కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, సంబంధిత రెవెన్యూ అధికారుల ద్వారా బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. పరవాడ ఫార్మా సిటీ, ఎన్టీపీసీ సింహాద్రి పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించి, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉద్యోగాలు లభించని 18 ఏళ్ల నిండిన అర్హులైన యువతకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.10 లక్షల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సక్రమంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తగు చర్యలు తీసుకుంటామన్నారు.

**యలమంచిలి టౌన్ :** స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు అర్జీలను స్వీకరించారు. అర్జీలను సత్వరం పరిష్కారం చేయాలనీ సంబంధిత అధికారులకుబదిలీ చేశారు. అనంతరం టీడీపీ జిల్లా నూతన కమిటీలో యలమంచిలి నుంచి జిల్లాఉపాధ్యక్షులుగా ఇత్తంశెట్టి రాజా వెంకట రమణారావు, కోటారు సాంబశివరావు, పార్టీ అధికార ప్రతినిధిగా దాడి రమేష్ ఎంపికైన నేపథ్యంలో వారికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, లాలం శ్రీ భరత్, పెంటకోట విజయ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, పిఎసిఎస్ చైర్మన్ కొలుకలూరు విజయరామరాజు, రాజాన నారాయణమ్మ, కరణం రవికుమార్, కాండ్రేగుల శంకర్, కర్రెడ్ల మల్లికార్జున, గుర్రాల రాము, గొర్లి బాబురావు, సేనాపతి తులసీరామ్, దాడి చంద్ర శేఖర్‌పాల్గొన్నారు.

# జాబ్ కేలండర్ ప్రకటించాలని నిరసన

**ప్రజాశక్తి-.అనకాపల్లి** : ఈ ఏడాది జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శనివార అర్ధనగ్న నిరసన చేపట్టారు ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను నిలబెట్టు కోవాలని, జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, నిరుద్యోగ యువతకు రూ.మూడు వేలు నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని అన్నారు..ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక రోడ్డున పడిన యువత మద్యం, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జి ఫణీంద్ర కుమార్, సమితి సభ్యులు బొందు బాబ్జి, గొర్లి అప్పలరాజు, బాలిబోయిన సురేష్,మొల్లి కిషోర్, మాడెపు నాయుడు బాబు, రాజు, సునీల్, సురేష్, పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌పై అవగాహన

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటుతో విద్యుత్‌తోపాటు డబ్బులు ఆదా అవుతాయని ఎపిఇపిడిసిఎల్ ఎఇఇ ఎం వెంకటరమణ తెలిపారు. శనివారం మండలంలోని పోలేపల్లి బుచ్చయ్యపేట దిబిడి గ్రామంలో సూర్యఘర్ పథకం కింద సోలార్ వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులో ద్వారాగా వినియోగదారులకు అవసరమైన రుణాలను ప్రభుత్వమే సమకూర్చుతుందని, అలాగే కేంద్రం ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందన్నారు ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, ఎంపీటీసీ గొంప చినబాబు, మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, లైన్‌ఇన్స్పెక్టర్ నాగా అ ప్పారావు, లైన్మెన్ కొండలరావు, జూనియర్ లైన్మెన్ రమేష్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటివేత

**ప్రజాశక్తి యలమంచిలి టౌన్ :** పట్టణంలోని యలమంచిలి ఆచల వారి చెరువు సమీపంలో యంగ్ స్టార్ అసోసియేషన్, విజన్ యలమంచిలి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ీ ముఖ్య అతిథిగా యలమంచిలి అడిషనల్ మెజిస్ట్రేట్ జడ్జి రమేష్, విశాఖపట్నం సెట్విన్ సిఇఒ రమ్య, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజు, యలమంచిలి ఎంపిపి రాజన సూర్య చంద్ర శేషగిరిరావులు హాజరయ్యారు. ఈ సందరేగా వారు మాట్లాడుతూ మానవుల మనుగడకు మొక్కలు నాటి సంరక్షించడం అవసరమన్నారు. చెట్ల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యంగ్ స్టార్ అసోసియేషన్ సభ్యులు జోగ వెంకటరమణ, చుక్కల శ్రీనివాసరావు, వరహాలు బాబు, వీసం మహేష్, నాగు, మంత్రి సాయి, సతీష్, నర్సింగరావు, డాక్టర్ నరేష్, యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు గోవిందరావు, వెంకట్రావు, పూర?య్య, రామకృష్ణారావు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

**ప్రజాశక్తి- వడ్డాది** : విశ్వబ్రాహ్మణులంతా ఐక్యతగా ముందుకు సాగితే సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చుక్క ఆచారి తెలిపారు శని వారం బుచ్చయ్యపేట రామాలయంలో మండల విశ్వ బ్రాహ్మణ కార్యవర్గ సమావేశం జరిగింది ఈ సందర్భంగా అధ్యక్షులు ఆచారి మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో చాలా గ్రామాలకు గ్రామ సంఘాలు ఉన్నాయని, మిగిలిన గ్రామాల్లో కూడా సంఘాలను ఏర్పాటు చేసి వాటి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు వచ్చే నెలలో బుచ్చయ్య పేటలో జిల్లా సమావేశం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు కార్యక్రమంలో చోడవరం నియోజకవర్గ ఇన్చార్జి చుక్క సత్తిరాజు మండల కన్వీనర్ కడియం శ్రీనివాస్ కు కన్వీనర్ ఎండపల్లి తులసిరావు చుక్క లక్ష్మణరావు గారోజు ఈశ్వరరావు బిలకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు

# పారిశుధ్య పనుల పరిశీలన

**ప్రజాశక్తి -యస్ రాయవరం.:** మండలంలోని దార్లపూడి,భీమవరం, ధర్మవరం, రాయవరం గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 26 నుండి వచ్చేనెల 4 వరకు ప్రతీ పంచాయతీలో ప్రత్యేక పారిశుధ్య పనులు జరుగుతాయన్నారు. వచ్చేనెల 5న జరిగే ప్రత్యేక గ్రామ సభలో గార్బేజ్ ఫ్రీ గ్రామ పంచాయతీగా ప్రకటించి తీర్మానం చేయాలని సూచించారు. గ్రామాల్లో సంపద కేంద్రాలన్నీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు.

# పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం

## - స్పీకర్ అయ్యన్నపాత్రుడు - ప్రసూతి నిరీక్షణ కేంద్రానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:** నర్సీపట్నం నియోజక వర్గాన్ని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శనివారం నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రూ.2కోట్ల 10లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రసూతి నిరీక్షణ కేంద్రం నిర్మాణానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ కెవిఎల్‌పి.రాజుతో కలిసి స్పీకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.35లక్షల విలువైన అత్యాధునిక టిఫా స్కానింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, 1985లో ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు వందలాది మందికి సేవలందిస్తోందని గుర్తు చేశారు. నర్సీపట్నం ఆసుపత్రిపై నమ్మకంతో తుని, పాడేరు వంటి సుదూర ప్రాంతాల నుండి కూడా గర్భిణీలు ప్రసవాల కోసం ఇక్కడికే వస్తున్నారని తెలిపారు. చివరి నిమిషంలో ఆసుపత్రికి రావడంతో తలెత్తుతున్న అనర్థాలను నివారించేందుకు ఈ ప్రసూతి నిరీక్షణ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గర్భిణీలు డెలివరీ డేట్‌కు రెండు రోజుల ముందే ఆసుపత్రికి వచ్చి, వైద్యుల పర్యవేక్షణలో ఉండేలా ఈ భవనాన్ని డిజైన్ చేశామన్నారు. గర్భిణీతో పాటు ఒక సహాయకురాలికి కూడా ఇక్కడే ఉచిత భోజన వసతి, పడక సదుపాయం కల్పిస్తామని, జిల్లా కలెక్టర్ చొరవతో డెక్కన్ ఫైన్ కెమికల్స్ సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద రూ.2.10కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. నర్సీపట్నంలోని 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ఎన్టీపీసీ సంస్థ రూ.72.5 లక్షలు మంజూరు చేసిందని, తద్వారా ఆయా ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగు పడతాయని స్పీకర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం కేవలం 7 టిఫా స్కానింగ్ మిషన్లను మంజూరు చేయగా, అందులో ఒకటి నర్సీపట్నం ఆసుపత్రికి రావడం గర్వకారణమని అయ్యన్న పాత్రుడు అన్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితిని, లోపాలను ముందుగానే గుర్తించడానికి ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నియోజక వర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సహకరిస్తున్న కలెక్టర్, దాతలైన డెక్కన్ కెమికల్స్ రాజుకి, ఎన్టీపీసీ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, డెక్కన్ ఫైన్ కెమికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిఎల్‌పి.రాజు, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, జడ్పిటిసి రమణమ్మ, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జ్ సూర్యచంద్ర, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి, డాక్టర్ కృష్ణారావు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధా, ఆసుపత్రి సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయకృష్ణన్

## టెన్త్‌లో శతశాతం ఫలితాలపై దృష్టి

**ప్రజాశక్తి- నక్కపల్లి:** టెన్త్‌లో శతశాతం ఫలితాల పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని, కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు జరపాలని మండల ప్రత్యేక అధికారి బి విజయ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఎంపీడీవో బి చైతన్య, ఎంఈఓ నరేష్ లతో కలిసి సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల సంసిద్ధతపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల అకాడమిక్‌కు సంబంధించిన పుస్తకాలను పరిశీలించారు. మండలంలో ప్రతి పాఠశాలను సందర్శించే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టీంలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇటీవల కాలంలో నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలలో భాగంగా రోజువారి జరిగిన సమాధాన పత్రములను ఆమె పరిశీలించారు. ఇప్పటికే మండలంలో ప్రతి పాఠశాలకు ఇతర శాఖల నుండి వంద రోజుల ప్రణాళికలు అమలుకు పరిశీలకులను అధికారులను నియమించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సెలవు రోజులలో సైతం విద్యార్థులకు అదనపు తరగతులను నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారులు సందర్శించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.విజయ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న అధికారులు

# బౌద్ధం వైజ్ఞానిక దృక్పథం

## 'తెలుగు సాహిత్యంపై బౌద్ధం ప్రభావం'పై సాహితీ గోష్టిలో వక్తలు

**ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి :** బౌద్ధం ఓ వైజ్ఞానిక దృక్పథం వంటిదని, శాస్త్రీయబద్ధంగా ఉంటుందని పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. అందువల్లే ప్రపంచ దేశాల సాహిత్యంపై బుద్ధిజం తీవ్ర ప్రభావం ఉన్నట్టుగా కనిపిస్తోందన్నారు. సిఐటియు అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ శనివారం అత్యంత ఉత్సాహపూరితంగా ప్రారంభమైంది. అదే మైదానంలో ఏర్పాటుచేసిన శ్రామిక సాహిత్య వేదికలో తెలుగు సాహిత్యంపై బౌద్ధం ప్రభావం అనే అంశంపై సాహితీ స్రవంతి విశాఖపట్నం జిల్లా నాయకులు చలపతి అధ్యక్షతన చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ నగరానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ మాటూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బుద్ధిజం కేవలం మన దేశంలోనే కాకుండా అనేక దేశాల్లో ప్రభావం చూపిందన్నారు. ఇప్పటికీ 144 దేశాల్లో బౌద్ధ సాహిత్యం ఉందన్నారు. మన ప్రాంతంలోని గురజాడ, బెంగాల్‌లోని ఠాగూర్, తిరుపతి వెంకటకవుల రచనల్లో బుద్ధిజం ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. వీరితోపాటు అనేక మంది అభ్యుదయ కవులు, రచయితలు బౌద్ధానికి పునరుజ్జీవం పోశారన్నారు. విశాఖపట్నంలో ప్రతి ఆరు కిలోమీటర్లకు బౌద్ధ స్తూపాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయన్నారు. స్వార్థం కోసం బుద్ధుడి భావాలను వ్యతిరేకించిన మేధావులు కూడా ఉన్నారని వివరించారు.

కర్నూలు సాహితీ స్రవంతి నాయకులు కుమారస్వామి మాట్లాడుతూ బుద్ధుడు గొప్పమానవతావాది అని కొనియాడారు. అందుకే బుద్ధుడిని ఆదిమ కమ్యూనిస్టుగా సంబోధిస్తారన్నారు. సొంత ఆస్తి ఉండకూడదని బుద్ధుడు ప్రబోధిస్తే, భూమి, ఇతర సహజ వనరులన్నీ జాతీయం చేయాలని కార్ల్ మార్క్స్ చెప్పారన్నారు. బుద్ధుడు సమానత్వం కోరితే, మార్క్స్ శ్రమదోపిడీని వ్యతిరేకించారన్నారు. ప్రతీదీ, అనుక్షణం మారుతుందన్న విషయం ఆనాడే బుద్ధుడు చెప్పారన్నారు. మార్క్స్ మార్పు అనివార్యమని చెప్పడంతో పాటు అంతర్గత ఘర్షణ, బాహ్యఘర్షణ ఇందుకు కారణమన్న విషయాన్ని కూడా వివరించారని గుర్తుచేశారు. అందుకే బుద్ధిజం, మార్క్సిజం ఆచరణాత్మక సిద్ధాంతాలుగా ఉన్నాయన్నారు. ఇతర మతాలు, పురాణాలు చెప్పుకోవడానికే తప్ప, ఆచరణలో అనేక ప్రతికూల ప్రభావాలు ఎదురౌతాయన్నారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ బుద్ధుడి కాలంలోని ప్రజాస్వామ్య సంస్కృతి నేర్చుకోవచ్చన్నారు. నేటి సమాజంలో ప్రజాస్వామ్యాన్ని సాక్షాత్తు పాలకులే కూల్చివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి బుద్ధిజానికి, నేటి రాష్ట్ర రాజధానిలో బుద్ధుడి విగ్రహాలు ఏర్పాటుదారులకు చాలా తేడా ఉందని చలోక్తులు వేశారు.

అనేక చోట్ల ఇప్పటికీ బుద్ధుని అవశేషాలు ఉన్నాయని, వాటిని పరిరక్షించడం ద్వారా బుద్ధిజంలో మంచిని సమాజానికి అందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో సెల్‌ఫోన్ వల్ల దూరమౌతున్న బంధాలపై పి.వెంకట చంద్రశేఖర్ పేరడీ కవిత ఆకట్టుకుంది. 'పిల్లల్లారా... పాపల్లారా... ఈ శతాబ్దపు పౌరుల్లారా..' అంటూ కవితను వినిపించి ఆలోచింపజేశారు. చర్చాగోష్ఠిలో పాల్గొన్న శ్రీనివాస్, కుమారస్వామిలకు రవి చేతుల మీదుగా శ్రామిక్ జ్ఞాపికలు అందజేశారు.




సాహిత్య గోష్టిలో మాట్లాడుతున్న మాటూరి శ్రీనివాసరావు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్ఐ, నాయకులు

## స్టడీ మెటీరియల్ పంపిణీ

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని చోద్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు జనసేన ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్‌ను ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణదేవిపేట ఎస్సై రుషికేశ్వరరావు మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సెక్రటరీ అల్లాడ సురేష్, నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాదుల ప్రసాద్ బాబు, దేవి, గొలుగొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బోయిన చిరంజీవి, స్కూల్ కమిటీ ఛైర్మన్ సత్తిబాబు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

## విద్యార్థినికి ఎంసెట్ పుస్తకాల వితరణ

**ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:** నర్సీపట్నం మున్సిపా లిటీ శివపురంలోని ఎస్టీ -1 బాలికల వసతి గృహంలో ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న బైపీసీ విద్యార్థిని పీ.రాజేశ్వరికి ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం ఎంసెట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థిని రాజేశ్వరికి చదువుపై ఆసక్తి ఉందని, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఈ పుస్తకాలను అందజేశామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ శోభ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు కళాశాల విద్యార్థినికి ఎంసెట్ పుస్తకాలు ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు గణపతి, వరుణ్, సంతోష్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో నూతన ఆసుపత్రి నిర్మాణం కోసం సంబంధిత అధికారులు శనివారం స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతితో పాటు గొలుగొండ ఇంచార్జ్ తహసీల్దార్ రామారావు, గ్రామ పార్టీ నాయకుడు కామిరెడ్డి గోవిందు పాల్గొన్నారు.

## సంతలో కోళ్లకు గిరాకీ

**ప్రజాశక్తి -హుకుంపేట:** హుకుంపేటలో శనివారం నిర్వహించిన వారపు సంతలో సంక్రాంతి పండుగ నేపథంలో కోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. పండుగ సమీపిస్తుండటంతో సంతకు వచ్చిన ప్రజలు కోళ్ల కొనుగోలుపై ఆసక్తి చూపారు. కేజీ నుంచి రెండు కేజీల వరకు బరువున్న కోడి రూ.800 నుంచి రూ.1000 వరకు ధర పలికింది. పండుగ సందర్భంగా వీటి కొనుగోలుకు ఆసక్తి చూపారు. రానున్న రోజుల్లో కూడా కోళ్లకు డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న

## కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి -నర్సీపట్నంరూరల్:**సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నర్సీపట్నంలో నిర్వహించనున్న మండల స్థాయి కబడ్డీ పోటీల కరపత్రాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, నర్సీపట్నంలోని వెలమవీధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో క్రీర్తిశేషులు రుత్తల లచ్చాపాత్రుడు జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 12 నుండి 14వ తేదీ వరకు స్థానిక పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ పోటీలు జరగను న్నాయన్నారు. ఈ పోటీలలో నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలు (నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం) చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులుగా మొదటి బహుమతి రూ.20వేలు, రెండవ బహుమతి రూ.15వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు లేదని, జట్లు కమిటీ సభ్యులను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**ప్రజాశక్తి -మాడుగుల:**మాడుగుల ఆర్అండ్ బీ అతిథి గృహంలో శనివారం మాడుగుల, చీడికాడ మండలాలకు సంబంధించి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయక నిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మాడుగుల మండలానికి సంబంధించి 19 మంది బాధితులకు సుమారుగా రూ.15,37 లక్షలు, చీడికాడ మండలానికి 5 మందికి రూ.2.94 లక్షలు చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయం ఛైర్మన్ అద్దేపల్లి జగ్గారావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.తెలుగుదేశం పార్టీ చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన 75 మంది బూత్ ఇంన్చార్జిలకు ఉత్తమ కార్యకర్తలుగా పార్టీ ఎంపిక చేయడం జరిగిందని ఎమ్మెల్యే బండారు అన్నారు. వారికి ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న బృందం సభ్యులు

## గ్రామాల్లో సదుపాయాలపై సమీక్ష

**ప్రజాశక్తి -మాడుగుల:**రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో అన్ని సదుపాయాలు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించడానికి శనివారం మాడుగుల మండల పరిషత్ కార్యాలయంలో ఐఐటీ ఖడ్గపూర్ బృందం మండల వార్డు సచివాలయం అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మండలంలోని ఉన్న అన్ని గ్రామాల నుంచి కార్యదర్శిలు, సర్పంచ్లు, సచివాలయం సిబ్బంది గ్రామాల్లో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెల్లారు. బృందానికి సంబంధించి అధికారులు సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేధిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.

### సిపిఎం నేత అప్పలరాజు అరెస్టుపై..

# 29న బంద్‌ను జయప్రదం చేయాలి

## -సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం-పలుచోట్ల నిరసనలు



రాజయ్యపేటలో నిరసన తెలుపుతున్న మత్స్యకారులు, లోకనాథం



కె.కోటపాడులో మాట్లాడుతున్న నాయనబాబు

**ప్రజాశక్తి- నక్కపల్లి:**ప్రజా ఉద్యమ నేత, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టి, అక్రమంగా అరెస్టు చేసి, జైల్లో పెట్టడం నిరసిస్తూ ఈనెల 29న నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో చేపట్టనున్న బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం కోరారు. నక్కపల్లిలోని సిపిఎం కార్యాలయంలో శనివారం బంద్‌కు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేసారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, నిరంతరం ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యలపై పోరాటం చేసిన అప్పలరాజు అరెస్టును ప్రజాస్వామ్యవాదులు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. నక్కపల్లి ప్రాంతంలో ఏ చిన్న సమస్య వచ్చినా, అప్పలరాజు కీలక పాత్ర పోషించి ప్రజల విశ్వాసాన్ని చూరగున్నారన్నారు. ఇంతకాలం అప్పలరాజు ప్రజా సమస్యలపై చట్టబద్ధంగానే పోరాటం చేశారన్నారు. అక్రమంగా, ప్రజాస్వామ్యంగా అతనిపై పిడి చట్టం పెట్టి జైల్లో పెట్టారని, ఇది పచ్చి దుర్మార్గమని, అప్రజాస్వామ్య చర్య అని అన్నారు. వెంటనే భేషరత్తుగా అప్పలరాజును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం పారిశ్రామిక వాడగా కాబోతుందని, పౌర హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వ యంత్రాంగం దీనికి భిన్నంగా వ్యవహరించే స్థితిలో ఉందన్నారు. సిపిఎం, వామపక్ష పార్టీలు, అభ్యుదయవాదులు కలిసి ఈనెల 29న నక్కపల్లి మండలం, ఎస్ రాయవరం మండలం, అడ్డురోడ్డు ప్రాంతాల్లో బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. మేధావులు, ప్రజాతంత్ర వాదులు, ఈ ప్రాంత ప్రజలు, షాపుల యాజమాన్యం, ఆటో, ముఠా కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులందరూ బంద్ లో స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి మనబాల రాజేష్, నాయకులు నగిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

### ఉద్యమాలను పక్కదారి పట్టించేందుకే..

**కె.కోటపాడు:** ప్రజా ఉద్యమాలనుపక్కదారి పట్టించేందుకే కుట్రపూరితంగా సిపిఎం నాయకులు ఎం అప్పలరాజుపై పిడి చట్టం ప్రయోగించి అరెస్టు చేసారని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు మండిపడ్డారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 2013 నుంచి నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజును అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఉద్యమ నాయకుడి పై ఇలాంటి చట్టం పెట్టడం దారుణమన్నారు. అప్పలరాజుపై పెట్టిన 19 కేసుల్లో 12 కేసులు న్యాయమూర్తులు రద్దు చేశారని , మిగిలినవి 151 సెక్షన్ సాధారణ కేసుల్లో ఉన్నాయన్నారు. పీడీయాక్ట్‌ను అప్పలరాజుపై పెట్టడం దుర్మార్గమని వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవుడు, ఆంధ్ర ప్రదేశ్ రైతుసంఘం మండల కార్యదర్శి సూర్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి నాయుడు బాబు పాల్గొన్నారు.

### రాజయ్య పేటలో ఆందోళన

**నక్కపల్లి:** సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు పై పిడి యాక్ట్ పెట్టి, అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో శనివారం నాలుగవ రోజు మత్స్యకారులు నిరసన చేపట్టారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం, సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. తప్పుడు కేసులను ఖండిస్తూ నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఆందోళనకు అప్పలరాజు పూర్తి మద్దతునిచ్చారని, పేదల పక్షాన నిలబడ్డ ఆయనను అరెస్టు చేయడం దారుణమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు మైలపల్లి మహేష్ బాబు, కాళ్ళ దేముడు, బొంది నూకరాజు, జి.స్వామి, చేపల సోమేష్, వీరబాబు, పి రాము, కె.కాశీరావు, నూకమ్మ చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### పూడిమడక బీచ్ వద్ద ఐద్వా ధర్నా

**యలమంచిలి టౌన్ :** నక్కపల్లి మండలం, రాజంపేట గ్రామంలో బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ పోరాటం చేసిన సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజుపై తప్పుడు ఆధారాలతో పీడీ యాక్ట్ పెట్టి అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఐద్వా నేతలు మండిపడ్డారు.. అప్పలరాజు అరెస్ట్‌ను నిరసిస్తూ అచ్చుతాపురం మండలం, పూడిమడక బీచ్ దగ్గర ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, మత్స్యకార సంఘం నాయకుడు చేపల తాతయ్య ఆధ్వర్యంలో బీచ్ దగ్గర ధర్నా చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రజాసమస్యలపై పోరాడుతున్న అప్పలరాజు వంటి నాయకులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ఈ దుర్మార్గాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అప్పలరాజు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మత్సకార గ్రామాల నుంచి యువత, మహిళలు, అన్నివర్గాల ప్రజలు పెద్దఎత్తున ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రెటరీ సిహెచ్ మంగతాయారి, జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్ లక్ష్మీ.. జాయింట్ సెక్రెటరీ నారాయణమ్మ.. కోదండమ్మ కాసులమ్మ నాగు పైడమ్మ పాల్గొన్నారు.



పూడిమడక బీచ్ వద్ద ఐద్వా నేతలు, మత్స్యకారుల నిరసన

### 29న బంద్ జయప్రదం చేయండి

**యస్ రాయవరం :** పీడీ యాక్ట్ పెట్టి సిపిఎం నేత అప్పలరాజు అరెస్ట్‌ను నిరసిస్తూ ఈనెల 29న సోమవారం ఎస్ రాయవరం మండలంలో అడ్డురోడ్డు ప్రాంతంలో బంద్ పాటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ తెలిపారు. శనివారం బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అభ్యుదయవాదులు, మేధావులు, స్కూల్స్,కార్మికులు, షాపులు అందరూ స్వచ్ఛందంగా బంద్‌కు మద్దతునివ్వాలని కోరారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, త్రిమూర్తులు,సతీష్ దొరబాబు పాల్గొన్నారు.

**అనకాపల్లి :** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు,ఎం.అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించి, ఆయనను వెంటనే విడుదల చేయాలని వామపక్ష పార్టీలు, అఖిలపక్ష ప్రజావేదిక డిమాండ్ చేస్తున్నాయి. ప్రజా సమస్యలపై పోరాడుతున్న అప్పలరాజుపై చట్టవిరుద్ధంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ ఈనెల 29న నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో బంద్ చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్. దొరబాబు, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు ప్రకటించారు. ఈ మండలాల్లో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, రవాణా, ట్రాన్సుపోర్టు, ప్రజలు సహకరించి బందును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజాసంఘాల ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

**మునగపాక:** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. అప్పలరాజుపై పెట్టిన పిడి. యాక్టును రద్దుచేసి తక్షణమే విడుదల చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు . శనివారం స్థానిక పిఎసిఎస్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద అక్రమ అరెస్ట్‌పై నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమకారులపై పిడి యాక్ట్ ను ప్రయోగించి అక్రమ నిర్బంధం చేయటం అన్యాయమన్నారు. ప్రజా పోరాటాలపై నిర్బంధాలు ప్రయోగిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో అప్పలరాజు అరెస్టును ఖండిస్తూ కె.సురేష్ , బాలు గాడి, నిర్వాసితుల సంఘం నాయకులు కె సదాశివరావు మాట్లాడారు. సిపిఎం మండల నాయకులు ఎస్ బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు ఎస్ కన్నమనాయుడు, కె సంజీవరావు, కౌలు రైతు సంఘం నాయకులు ఎ.శివ, రమణ, రామభద్రరావు పాల్గొన్నారు.

### అరెస్టు చేయడం దుర్మార్గం

**పాయకరావుపేట :** సిపిఎం నేత అప్పలరాజుపై పిడి చట్టం ఉపయోగించి అరెస్టు చేయడం దుర్మార్గమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావు జగ్గారావు మండిపడ్డారు.బల్క్ డ్రగ్ పార్కుతో తమ ఆరోగ్యం, జీవనోపాధి దెబ్బతింటుందని మత్స్యకారులు చేస్తున్న ఆందోళనకు సంఘీభావం తెలిపే కమ్యూనిస్ట్ నేతలపై ఇటువంటి దుర్మార్గపు చట్టాలు పెట్టడం కూటమి ప్రభుత్వానికి తగదని హితవు పలికారు.



మాట్లాడుతున్న భద్రం, వెంకటేశ్వరరావు

### అప్పలరాజుపై పీడీ యాక్ట్ దుర్మార్గం :సిపిఐ

**అనకాపల్లి :** విషపూరిత బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రైతుల ఉద్యమానికి అండగా నిలిచిన అనకాపల్లి జిల్లా సిపిఎం నాయకుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజును అరెస్టు చేసి పీడీ యాక్ట్ నమోదు చేయడం దుర్మార్గమని సిపిఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, సీనియర్ నేత వై ఎన్ భద్రం విమర్శించారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ, కరుడుగట్టిన నేరస్తులు, దోపిడిదారులు, డ్రగ్స్ సరఫరా దారులపై పెట్టాల్సిన కేసులను ప్రజాఉద్యమ నాయకుడిపై పెట్టడం దుర్మార్గమని, వెంటనే ఉపసంహరించుకోవాలని అప్పలరాజును విడుదల చేయాలన్నారు.